# 21

# పన్నెండుమంది పంపబడుట

## (10:1-23)

దీనికి ముందటి అధ్యాయము యొక్క ముగింపు, పదవ అధ్యాయమునకు పరిచయముగా కూడ పనికివచ్చుచున్నది: "గనుక తన కోతకు పనివారిని పంపుమని కోత యజమానుని వేడుకొనుడి" (9:38). యేసు పన్నెండు మందిని పరిమితమైన నియామకముపై యూదా ప్రజల యొద్దకు పంపించుచుండెను. దేవుని రాజ్యము సమీపించుచున్నదని వారు ప్రజలకు ప్రబోధించుచు, రోగులను స్వస్థపరచుట మరియు దయ్యములను వెళ్లగొట్టుట ద్వారా వారి సందేశమును న్యాయసమ్మతము గావింపవలసి యుండినది. పదవ అధ్యాయములోని యేసు నియామకము చేయుచున్న వివరము, మత్తయి సువార్తలో రెండవ పెద్ద ప్రసంగము గలదై యున్నది.

ప్రధానంగా, ఈ అధ్యాయములో యేసు ఇచ్చుచున్న ఆదేశములు పన్నెండు మంది శిష్యులు ఇశ్రాయేలులో చేపట్టిన వారి పరిమితమైన బృహత్కార్యమునకే నిర్బంధింపబడినవి (10:5–15, 23). ఏదిఏమైనా, ఆయన ఇచ్చిన నిర్దేశనములలో కొన్ని వాటి లక్షణములో ఎక్కువ సాధారణమైనవై యుండినవి (10:18, 22, 26, 28, 32). ఇవి వారి దృష్టిని యేసు ఇచ్చిన మహా ఆదేశము దిశగా మళ్లించుచుండినవి, క్రీస్తును గూర్చిన శుభ సందేశము సమస్త జనులతో పంచుకొనబడవలెనని ఆ ఆదేశము ఆజ్ఞాపించినది (28:18–20; మార్కు 16:15, 16; లూకా 24:46, 47). ఇట్టి అవగాహనతో, పదవ అధ్యాయము పన్నెండు మంది యొక్క మహత్కార్యముతో మాత్రమే గాక, కొన్ని స్థాయిలలో, సంఘము యొక్క ప్రేషణోద్యమముతో (మిషన్‌తో) కూడ వ్యవహరించుచున్నది.[1]

మత్తయి యొక్క అత్యున్నతమైన ఆసక్తి, పరిమితమైన ఆజ్ఞతో కూడిన పనికంటే ఎక్కువగా యేసు ఇచ్చిన ఉపదేశములయందు ఉండినదని అగుపించుచున్నది. శిష్యులు యేసు యొద్ద సెలవు తీసికొని వెళ్లిపోవుట, వారు చేసిన పనులు, మరియు వారు తిరిగి వచ్చుటకు సంబంధించినంత వరకు వాస్తవమైన ఏ నివేదికయు మనకు తెలియజెప్పబడలేదు (మార్కు 6:12, 13, 30; లూకా 9:6, 10 చూడు). ఈ ప్రసంగము తదుపరి, యేసు "వారి పట్టణములలో భోదించుటకును ప్రకటించుటకును *యేసు* అక్కడ నుండి వెళ్లిపోయెనని" మత్తయి చెప్పుచున్నాడు (11:1).[2]

### పన్నెండు మందిని పిలుచుట (10:1–4)

**1ఆయన తన పంద్రెండుమంది శిష్యులను పిలిచి, అపవిత్రాత్మలను వెళ్లగొట్టుటకును, ప్రతివిధమైన రోగమును ప్రతివిధమైన వ్యాధిని స్వస్థపరచుటకును, వారికి అధికార మిచ్చెను.**
**2ఆ పంద్రెండుమంది అపొస్తలుల పేళ్లు ఏవనగా, మొదట పేతురనబడిన సీమోను,**

**అతని సహోదరుడగు అంద్రెయ; జెబెదయి కుమారుడగు యాకోబు, అతని సహోదరుడగు యోహాను; [3]ఫిలిప్పు, బర్తొలొమయి; తోమా, సుంకరియైన మత్తయి; అల్ఫయి కుమారుడగు యాకోబు, తద్దయియను మారు పేరుగల లెబ్బయి; [4]కనానీయుడైన సీమోను, ఆయనను అప్పగించిన ఇస్కరియోతు యూదా.**

**వచనము 1. యేసు** నానావిధములైన జీవన వృత్తులలో నుండి శిష్యులను భారీ సంఖ్యలో సమావేశపర్చుచుండెను. ఆయన వారితో కూడ సమయము గడుపుచుండుట వలన ఆయన వారి శీలమును మరియు ప్రవర్తనను గమనించుటకు ఆయనకు అదొక అవకాశమును కల్పించినది. ఈ పెద్ద గుంపులో నుండి (లూకా 10:1 చూడు), ఆయనకు అత్యంత సన్నిహితమైన **శిష్యులుగా** ఉండునట్లు ఆయన కొందరిని ఏర్పరచుకొన్నాడు. "శిష్యుడు" అను పదమునకు (*mathētēs*) "నేర్చుకొనుచున్నవాడు" లేదా "వెంబడించుచున్నవాడు" అని అర్థము. పన్నెండు మంది శిష్యుల ఎంపిక మరియు నియామకము మార్కు 3:13-15 మరియు లూకా 6:12, 13లో వర్ణింపబడి యున్నవి.

వారి వ్యక్తిగత శక్తి సామర్థ్యములు, అర్హత, లేక విశ్వసనీయత ఆధారంగా కాదు, కానీ ప్రభువు యొక్క సార్వభౌమాధికారముతో కూడిన చిత్తము మరియు సంకల్పము ప్రకారమే వీరు ఏర్పరచుకొనబడిరి. యేసు ఒక రాత్రంతయు ఈ విషయమై ప్రార్థన చేయుటలో గడిపిన తరువాతనే వారు ఏర్పరచుకొనబడిరి (లూకా 6:12). ఆయన ఇదే పని ఇతర సందర్భములలో సహితము నిస్సందేహముగా చేసియుండవచ్చును, అయితే యేసు రాత్రంతయు ప్రార్థించాడని లేఖనములు మనకు తెలియజెప్పుచున్న సందర్భము ఇదొక్కటే. ఆయన ఆ రాత్రి ప్రార్థన చేయుటలో ప్రదర్శించిన నిష్ఠ, ఈ నిర్ణయము చేసికొనుట ఎంతటి కీలకమైన సంగతైయున్నదని ఆయన పరిగణించాడో, నిశ్చయముగా ఇది ఉదాహరణంగా చిత్రీకరించుచున్నది. వీరిలో నుండిన కొరతలు స్పష్టమైనవై యుండినవి: వారికి అధ్యాత్మిక అవగాహన, వినయము, విశ్వాసము, నిబద్ధత, మరియు అధికారము లేదు. ఏదిఏమైనా, వారు యేసుతో కూడ మూడు సంవత్సరములకు పైబడి యుండుట వలన అది వారి జీవితములనే మార్చివేసినది.

ప్రస్తుతము మనము అధ్యాయనము చేయుచున్న మత్తయి సువార్తలోని గ్రంథ పాఠము పన్నెండు మంది శిష్యులను ఎన్నుకొనుట మరియు నియమించుకొనుటను గూర్చి కూడ సూచించుచున్నదా? **పిలిచెను** అని అర్థమిచ్చునట్లు అనువదింపబడిన గ్రీకు పదము (*proskaleō*) "ఒక ప్రత్యేక కార్యభారము లేక అధికారము కొరకు పిలువబడుట" అని అర్థమిచ్చును (అపొస్తలుల కార్యములు 13:2; 16:10 చూడు) లేక "తనయొద్దకే పిలుచుకొనుట" యను అర్థమిచ్చును.[3] ఈ రెండవ అర్థము క్రొత్త నిబంధనలో అతి తరుచుగా వచ్చుచున్నది గనుక ఈ సందర్భములో ఉద్దేశింపబడినది ఇదే అర్థమై యుండును. అనగా, వారిని పరిమితమైన మహత్కార్యముపై ఆ యా చోట్లకు పంపించునట్లు యేసు కేవలము తన శిష్యులను - ఆయన అదివరకే ఎంపిక చేసికొనినవారిని - యేసునొద్దకు పిలుచుకొనుచుండిన ఆయన శిష్యులు అని మరొక మాటలో చెప్పుకొనవచ్చును.[4]

యేసు పన్నెండు మంది శిష్యులను ఏర్పరచుకొన్నాడను వాస్తవము గొప్ప ప్రాధాన్యతను సంతరించుకొనుచున్నది. "పన్నెండు అను సంఖ్య దేవుని కార్యక్రమములో రక్షణ చరిత్ర

అఖండతకు గురుతుగా నున్నదని" మిఖాయేల్ జే. విల్కిన్స్ భావించాడు.[5] పాత నిబంధనలో, పన్నెండు మంది మూలపురుషులు (ఆదికాండము 35:22; 42:13, 32) పన్నెండు ఇశ్రాయేలు గోత్రములు ఏర్పడుటకు హేతువయ్యారు (నిర్గమకాండము 24:4; 28:21). పన్నెండు మంది అపొస్తలులు మరియు పన్నెండు గోత్రముల మధ్యగల అనుసంధానం, ఆయన శిష్యులు "పండ్రెండు సింహాసనముల మీద ఆసీనులై ఇశ్రాయేలు పండ్రెండు గోత్రములవారికి తీర్పుతీర్చుదురని" యేసు చేసిన ప్రకటనలో గమనించనగును (19:28). అంతమాత్రమేగాక, పరలోక పట్టణము గూర్చిన దర్శనములో, వారి పేర్లు నూతన యెరూషలేము యొక్క పునాది రాళ్లపై చెక్కబడి కనబడుచున్నవి (ప్రకటన 21:14). యేసు ఏర్పరచుకొనిన శిష్యులు నూతన ఇశ్రాయేలు (లేక సంఘము), దేవుని నిజమైన ప్రజలు (రోమీయులకు 2:28, 29; 9:6–8; గలతీయులకు 3:29; 6:16; ఫిలిప్పీయులకు 3:3; యాకోబు 1:1; 1 పేతురు 1:1–2), ఏర్పడుటకు హేతువౌదురు. నిజముగా, సంఘమునకు "క్రీస్తు యేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా, అపొస్తలులును ప్రవక్తలును వేసిన పూనాది మీద కట్టబడి యున్నది" (ఎఫెసీయులకు 2:20).

ఈ కాలమునకు మునుపు, యేసు ఇంచుమించు ఒంటరిగానే పరిచర్య చేసాడు. పన్నెండు మంది శిష్యులు, జనసమూహములతో కూడ, ఆయనను వెంబడించారు – అయితే వారు పరిచర్యలో పాల్గొనుచుండినవారుగా కాదు, కానీ కేవలము శ్రద్ధగా గమనించుచుండినవారుగా మాత్రమే ఆయన వెంట వెళ్లారు. ఈ సమయంలో, యేసు **అపవిత్రాత్మలు వెళ్లగొట్టుటకును, ప్రతివిధమైన వ్యాధిని స్వస్థపరచుటకును, వారికి అధికారమును** (లేక "శక్తిని")[6] ఇచ్చెను. ఇచ్చట ప్రయోగింపబడుచున్న భాష యేసు పరిచర్య గూర్చి గతములో వర్ణింపబడిన విషయాలను జ్ఞప్తికి తెచ్చుచున్నది (4:23; 9:35).

ఇదొక పరిమితమైనదిగా అప్పగింపబడిన కార్యభారమై యుండినందునుబట్టి, పన్నెండు మంది కలిగియుండిన శక్తి కొంత కాలము మట్టుకే నిలిచియుండవచ్చును. యేసు అటు తరువాత, ఆయన పరమునకు చేర్చుకొనబడక మునుపు, "పరిశుద్ధాత్మ వారి [మీ] మీదికి వచ్చునప్పుడు వారు [మీరు] శక్తినొందెదరని" వారికి వాగ్దానము చేసాడు (అపొస్తలుల కార్యములు 1:8). ఈ వాగ్దానము ఆయన పరమునకు చేర్చుకొనబడిన పిదప పెంతెకొస్తు దినాన నెరవేరినది (అపొస్తలుల కార్యములు 2:1–4). ఈ శక్తిని గూర్చి ఒక వివరము వారికి అదివరకు ప్రధానము చేయబడిన శక్తి నుండి భిన్నమైనదై యుండినది: ఈ సారి వారు ఇతరులకు అద్భుతకరమైన పరిశుద్ధాత్మ వరములను ప్రసాదించు సామర్థ్యము కలిగియుందురు (అపొస్తలుల కార్యములు 8:14–19).

**వచనములు 2–4. పన్నెండు మంది అపొస్తలుల పేర్లను**, యేసు వారిని పంపించక మునుపు, మత్తయి ఒక జాబితాగా ఇచ్చాడు. లూకా వ్రాసిన సువార్త ప్రకారము, యేసు అంతకు పూర్వము ఈ పన్నెండు మందిని ఏర్పరచుకొనక మునుపు, ఆయన "వారికి అపొస్తలులు అను పేరు పెట్టెను" (లూకా 6:13). "అపొస్తలుడు" అని అర్థమిచ్చునట్లు అనువదింపబడిన గ్రీకు పదము (*apostolos*) మత్తయి వ్రాసిన సువార్తలో ఈ ఒక్కసారి మాత్రమే అగుపించును, ఒకటిరెండు పర్యాయములు మార్కు వ్రాసిన సువార్తలోను (మార్కు [3:14][7]; 6:30), మరియు యోహాను వ్రాసిన సువార్తలో ఒక పర్యాయము (యోహాను 13:16) అగుపించును. ఈ పదము క్రొత్త నిబంధనలో అత్యధికంగా లూకా మరియు పౌలు

గావించిన రచనలలో అగుపించును. "అపొస్తులుడు" *apostellō* అను క్రియా పదముతో సంబంధము గలదై యుండి, "ఏర్పరచుకొనబడి పంపబడినవాడును" అర్థము నిచ్చుచున్నది. అది ఎంపిక చేసికొనబడి, బాధ్యత అప్పగింపబడి, వానిని పంపినవాని పక్షముగా చర్యలను చేపట్టుటకు అధికారమియ్యబడి పంపబడిన వానిని సూచించుచున్నది. ఈ పన్నెండు మంది శిష్యులు యేసును గూర్చి "యెరూషలేములోను, యూదయ సమరయ దేశముల యందంతటను భూదిగంతముల వరకును" సాక్ష్యమిచ్చునట్లు ఆయనకు వ్యక్తిగతమైన రాయబారులయ్యారు (అపొస్తలుల కార్యములు 1:8). వారు "తనతో కూడ ఉండునట్లును" ... "సువార్త ప్రకటించుటకును వారిని పంపవలెనని" ఆయన వారిని ఏర్పరచుకొనెనని మార్కు చెప్పుచున్నాడు (మార్కు 3:14).

యేసు యొక్క అపొస్తలులై యుండుటకు, కొన్ని నిర్దిష్టమైన అర్హతలు అవసరమై యున్నవి. ఉదా॥ ఇస్కరియోతు యూదా స్థానంలో అభ్యర్థియై యుండుటకు ఏర్పరచుకొనబడినవాడు, అపొస్తలులతో కూడ "యోహాను బాప్తిస్మమిచ్చినది మొదలుకొని ప్రభువైన యేసు పరమునకు చేర్చుకొనబడిన దినము వరకు, ఆయన వారి మధ్య సంచరించుచుండిన కాలమంతయు గడిపినవాడై" యుండవలసి యుండెను. ఈ విధంగా యూదా స్థానంలో ఏర్పరచుకొనబడినవాడు ఇతర అపొస్తలులతో కూడ "ఆయన పునరుత్థానమును గూర్చి సాక్షియై" యుండును (అపొస్తలుల కార్యములు 1:21, 22). యేసు పునరుత్థానుడైన తరువాత అపొస్తలులు ఆయనను చూచినవారై (1 కొరింథీయులకు 9:1) మరియు వారు ప్రభువు చేత ఏర్పరచబడినవారై (ఎఫెసీయులకు 4:11)[8] యుండవలసి యుండినదని ఇతర లేఖన భాగములు సూచించుచున్నవి.

అపొస్తలుల గూర్చినవి ఇంకా మూడు జాబితాలు క్రొత్త నిబంధనలో ఇవ్వబడినవి (మార్కు 3:16-19; లూకా 6:14-16; అపొస్తలుల కార్యములు 1:13). ఈ నాలుగు జాబితాలను పోల్చి చూచినప్పుడు, వారి పేర్లలో గల గమనింపదగు తేడాలు స్పష్టముగా తెలియును. ప్రజలు తరచుగా ఒకటి కంటె ఎక్కువ పేర్లను కలిగియుండిరను గ్రహింపు చేత ఈ వైవిధ్యములు సులభముగా వివరింపనగును. జాబితాలలో పేర్లు వ్రాయబడిన వరుస క్రమము కూడ కొంచెము భిన్నముగా నున్నది.

ఈ జాబితాలన్నిటిలోను, **సీమోను,** యేసు **పేతురు** అని నామకరణము చేసినవానిపేరు, **మొదట** అగుపించును. అపొస్తులులలో అతడు ఒక నాయకుడుగా కొట్టవచ్చినట్లు ఉండినాడు, ఈ విషయము సువార్తలు మరియు అపొస్తులుల కార్యములలోని తొలి అధ్యాయముల ద్వారా విదితమగుచున్నది. మత్తయి వ్రాసిన జాబితాలో, పేతురు తరువాత **అతని సహోదరుడగు అంద్రెయ** పేరు గలదు. ఈ సహోదరులిరువురు చేపలు పట్టు వృత్తి నుండి పిలువబడిన విధానము సువార్తలోని తొలి పుటలలో వ్రాయబడి యున్నది (4:18-20పై గల వ్యాఖ్యానములను చూడు). అటుతరువాత, **జెబదయి కుమారుడగు యాకోబు, అతని సహోదరుడగు యోహానుతో** కూడ పేర్కొనబడి యున్నాడు. ఈ ఇద్దరు సహోదరులకు యేసు "ఉరిమెడువారు" అను మారుపేరు పెట్టాడు (మార్కు 3:17). వీరి పిలుపును గూర్చిన వివరము కూడ మత్తయి సువార్తలోని తొలి పుటల్లో వ్రాయబడి యున్నది (4:21, 22పై గల వ్యాఖ్యానములను చూడు). పేతురు, యాకోబు, మరియు యోహాను యేసు క్రీస్తును అత్యంత సన్నిహితముగా వెంబడించుచుండినవారని స్పష్టముగా కనబడుచున్నది.

ఈ ముగ్గురు "అంతర్గత వలయము" అని ముద్రవేయబడిరి, ఏలయనగా యేసుతో కూడ ఎచ్చోటికైనను వెళ్లుటకు వారు మాత్రమే ఒక ప్రత్యేకార్హతగలవారై యుండిరి – ఉదా॥ యాయీరు కుమార్తెను లేపుటకు వెళ్లినప్పుడు (మార్కు 5:37), రూపాంతరము పొందిన సమయంలో (17:1), మరియు గెత్సేమనే తోటలో ప్రార్థించుటకు వెళ్లినప్పుడు (26:37) వారు మాత్రమే ఉండిరి.

**ఫిలిప్పు** పేరు యోహాను వ్రాసిన సువార్తలో అనేక పర్యాయములు పేర్కొనబడి యున్నది (యోహాను 1:44–46; 6:5–7; 12:20–22; 14:8). ఈయన, పేతురు మరియు అంద్రెయ వలెనే, బేత్సాయిదా వాస్తవ్యుడు (యోహాను 1:44). నతనయేలును యేసు నొద్దకు నడిపించినవాడు కూడ ఈయనే (యోహాను 1:45, 46). అటుతరువాత **బర్తలొమయి** పేర్కొనబడియున్నందు వలన, నతనయేలు అని సంబోధింపబడినవాడు ఇతడే అని కొందరు నమ్ముదురు (యోహాను 1:45; 21:2). "బర్తలొమయి" అను పేరు అతడు "తోల్మయి" లేక "తొలెమి" ("Ptolemy"[9]) అను పేరు గల వాని కుమారుడని అతనికి గుర్తింపు కలిగించి యుండును. **తోమా**, "దిదుమ" అని కూడ పిలువబడినాడు (యోహాను 11:16; 20:24; 21:2) "తోమా" అను పేరు ఒక అరమెయిక్ పేరు వలన కలుగుచున్నది. అయితే "దిదుమ" అనునది గ్రీకు భాషలో దానికి సమానార్థమిచ్చు పదమై యున్నది ఈ రెండు పేర్లకు "కవల" లేక "జంట" అని అర్థము. ఈ నామధేయముల వలన అతడు కవల పిల్లల్లో ఒకడై యుండునని అందరు భావించుచుండిరి. **సుంకరియైన మత్తయి**, "లేవి" అని కూడ పిలువబడినవాడు (మార్కు 2:14), యేసు శిష్యుడై యుండుటకు అతడు సుంకము వసూలు చేయుచుండిన మెట్టు నొద్ద నుండి యేసు చేత పిలువబడినాడు (9:9పై గల వ్యాఖ్యానములను చూడు).

**యాకోబు**, బహుశా కీర్తిగడిసిన అతని సహస్థానీయుడైన యాకోబు, అనగా జెబెదయి కుమారుడును యోహాను సహోదరుడైనవాని నుండి అతనిని భిన్నంగా గుర్తించగలుగుటకు, **అల్ఫయి కుమారుడని** పిలువబడుచున్నాడు. "చిన్న యాకోబు యోసే" (మార్కు 15:40) లేక "చిన్నవాడైన యాకోబు" (NIV) అని పిలువబడుచుండినవాడు కూడ ఇతడే అయియుండవచ్చును. **తద్దయియ**, ఇతర అపొస్తలత్వ జాబితాలలో "యాకోబు కుమారుడగు యూదా" అని సంబోధింపబడినవాడే అయియుండునని తలంచబడుచున్నది (లూకా 6:16; అపొస్తలుల కార్యములు 1:13). ఇస్కరియోతు యూదాతో తికమక ఏర్పడకుండునట్లు, మత్తయి మరియు మార్కు "తద్దయియ" అను పేరు ఉపయోగించి యుండవచ్చును, ఒక సందర్భములో, యోహాను ఇతనిని "(ఇస్కరియోతు కాని) యూదా" అని ప్రస్తావించాడు (యోహాను 14:22). "తద్దయియ"కు బదులుగా (10:3; మార్కు 3:18), కొన్ని ప్రాచీన వ్రాత ప్రతులలో "లెబ్బయియ" అని పేర్కొనబడి యున్నది. **జెలోతే అనబడన సీమోను**, ఈ వాక్యభాగములో, అక్షరాలా ఎక్కువగా "కనానీయుడైన సీమోను" (NRSV) అయియున్నాడు. జాక్ పి. లూయిస్ ఇలా వివరించుచున్నాడు, "కనానీయుడు అను పదము 'మతాభిమానియై యుండుట'[10] అని అర్థమిచ్చు *కనా* kana అను ఒక హెబ్రీ పదము నుండి ఉత్పత్తియగుచున్నది." ఇతనిని వర్ణించుటకు లూకా, "జెలోతే" అని అనువదింపబడిన గ్రీకు పదమును *zēlōtēs* ప్రయోగించాడు (లూకా 6:15 అపొస్తలులు కార్యములు 1:13).

అతని పేరు చేర్చబడని అపొస్తలుల కార్యములు 1:13లో మినహాయిస్తే, ప్రతి

జాబితాలోను ఇస్కరియోతు యూదా పేరు చిట్టచివరన అగుపించుచున్నది. **ఇస్కరియోతు యూదా** స్థానంలో అవసరమై యుండిన మరొక శిష్యుని, "మత్తీయ"ను ఎన్నుకొనవలసి వచ్చినప్పుడు, అతడు యేసును అప్పగించిన ప్రస్తావన అపొస్తలుల కార్యములు 1:25, 26లో పేర్కొనబడినది. "ఇస్కరియోతు" అను పదము "కెరీయోతు వాడు" అను అర్థము నీయవచ్చును, కెరీయోతు పట్టణము యూదాలో కలదు (యెహోషువ 15:25).[11] ఇదే నిజమైనట్లయితే, గలిలయ వాస్తవ్యుడు కానివాడైన ఒకే ఒక అపొస్తలుడు యూదా మాత్రమే. ఈ పదము గూర్చి ఇతర భాష్యములు కూడ సూచింపబడినవి: "దొంగచాటు హంతకుడు," "నమ్మకద్రోహి," "ఎర్రని ముఖముగలవాడు," "ఎర్రని తల గలవాడు," "తలకు ఎర్రని అద్దకపు రంగు గలవాడు," మరియు "తోలు సంచులు మోయువాడు."[12] అనేక ప్రాచీన వ్రాత ప్రతులు అతని తండ్రిని "సీమోను ఇస్కరియోతు" అని ప్రస్తావించుచున్నవి (యోహాను 6:71). యూదా, ఒక దొంగయై యుండెను (యోహాను 12:6), అతడు విశ్వాసఘాతకుడై మన ప్రభువును **అప్పగించాడు**. ఒకానొక సందర్భములో యేసు, "నేను మిమ్మును, పండ్రెండుగురిని ఏర్పరచుకొనలేదా? మీలో ఒకడు సాతాను" అని అతని గూర్చి పలికాడు (యోహాను 6:70, 71).

వారందరు విభిన్నమైన నేపథ్యముల నుండి వచ్చినవారైనప్పటికిని యేసు ఈ పన్నెండుగురిని ఎంపికచేసికొన్నాడు. వారందరికిని సమష్టిగా సంబంధించిన విషయాలను అనేకముండినప్పటికిని, వారు వెవ్వేరు వ్యక్తిత్వములు మరియు చిత్తవృత్తులు కలిగియుండిరి. పేతురు దుడుకుతనముతో కూడిన ఆశావాదియై, తరుచుగా ఆలోచింపక మునుపే మాట లాడుచుండెను (14:28; 26:33, 35). తోమా, అతనికి ఉపదేశింపబడిన ఏ విషయమునైనను అంగీకరింపక మునుపు, సంబంధిత రుజువును కోరుచుండిన ఒక నిరాశావాదియై యుండెను (అతడొక వాస్తవికవాది యని కొందరనుచుండిరి) (యోహాను 11:16; 20:24, 25). జెలోతీయుడైన సీమోను, రోమీయులు మరియు తోలుబొమ్మల వలె ఆటలాడుచుండిన వారి రాజులు, హేరోదుల గూర్చి ఏ విషయమునైనను బాహాటంగా ప్రకటించుచు వారికి శత్రువై యుండెను. మరియు సుంకము వసూలుచేయుచుండిన వారిని ద్వేషించుచుండెను. హాస్యాస్పదముగా, అటుతరువాత అతడు సుంకము వసూలుచేయుచుండిన మత్తయితో కూడ జతపనివాడైన అపొస్తలుడయ్యాడు. విభిన్న నేపథ్యములకు సంబంధించిన వ్యక్తులను ఏర్పరచుకొని, వారిని ఒక సమైక్య సౌవార్తీకరణ దళముగా సంసిద్ధము చేయుటలో యేసు యొక్క గొప్పతనము సుస్పష్టముగా గోచరించుచున్నది. వీరందరు కలిసి, "భూలోకమును తలక్రిందులు చేసారు" (అపొస్తలుల కార్యములు 17:6; KJV చూడు).

## పన్నెండుగురిని అధికారమిచ్చి పంపుట
## (10:5–15)

**5యేసు ఆ పండ్రెండుమందిని పంపుచు, వారినిచూచి వారికాజ్ఞాపించినదేమనగా – మీరు అన్యజనుల దారిలోనికి వెళ్లకుడి, సమరయుల యే పట్టణములోనైనను ప్రవేశింపకుడి గాని 6ఇశ్రాయేలు వంశములోని నశించిన గొఱ్ఱెల యొద్దకే వెళ్లుడి. 7వెళ్లుచు–పరలోకరాజ్యము సమీపించి యున్నదని ప్రకటించుడి. 8రోగులను స్వస్థపరచుడి, చనిపోయినవారిని లేపుడి, కుష్ఠరోగులను శుద్ధులనుగా చేయుడి, దయ్యములను వెళ్లగొట్టుడి. ఉచితముగా పొందితిరి**

**ఉచితముగా ఇయ్యుడి. [9]మీ సంచులలో బంగారమునైనను వెండినైనను రాగినైనను ప్రయాణముకొరకు జాలెనైనను రెండు అంగీలనైనను చెప్పులనైనను చేతికఱ్ఱనైనను సిద్ధపరచుకొనకుడి; [10]పనివాడు తన ఆహారమునకు పాత్రుడు కాడా? [11]మరియు మీరు ఏపట్టణములోనైనను గ్రామములోనైనను ప్రవేశించునప్పుడు, అందులో ఎవడు యోగ్యుడో విచారణచేసి, అక్కడనుండి వెళ్లువరకు అతని యింటనే బసచేయుడి. [12]ఆ యింటిలో ప్రవేశించుచు, ఇంటివారికి శుభమని చెప్పుడి. [13]ఆ యిల్లు యోగ్యమైనదైతే మీ సమాధానము దానిమీదికి వచ్చును; అది అయోగ్యమైనదైతే మీ సమాధానము మీకు తిరిగి వచ్చును. [14]ఎవడైనను మిమ్మును చేర్చుకొనక మీ మాటలు వినకుండిన యెడల మీరు ఆ యింటినైనను ఆ పట్టణమైనను విడిచిపోవునప్పుడు మీ పాదధూళి దులిపివేయుడి. [15]విమర్శదినమందు ఆ పట్టణపు గతికంటె సొదొమ గొమొఱ్ఱా ప్రదేశముల గతి ఓర్వతగినదై యుండునని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను.**

యేసు తన అపొస్తలులను పిలుచుకొన్నాడని మొదట నివేదించి (10:1), వారి పేర్లున్న ఒక జాబితాను సమకూర్చి (10:2–4), ఆ మీదట యేసు వారి పరిమితమైన అధికార కార్యభారము గూర్చి ఇచ్చిన నిర్దిష్టమైన ఆదేశములను మత్తయి ఈ వాక్యభాగములో చేర్చాడు (10:5–15).

**వచనములు 5, 6.** అపొస్తలులు యేసు యొద్ద సెలవు తీసికొని వెళ్లుట, వారు చేసిన ప్రేషణోద్యమ పనులు, లేక వారు తిరిగి ఆయన యొద్దకు వచ్చుట గూర్చిన ప్రత్యేక వివరణలు ఇవ్వబడలేదు. **యేసు ఆ పండ్రెండుమందిని పంపుచు, వారిని చూచి వారికాజ్ఞాపించినదేమనగా** అని మాత్రమే మత్తయి వ్రాయుచున్నాడు. "పంపెను" అని అర్థమిచ్చునట్లు అనువదింపబడిన గ్రీకు పదము (*apostellō*), "అపొస్తలుడు" అను నామవాచకముతో సంబంధముగలదై యున్నది. అపొస్తలులు "ఇద్దరిద్దరుగా" పంపబడిరని మార్కు 6:7లో సూచించుచున్నది. "ఆజ్ఞాపించినదేమనగా" అని అనువదింపబడిన క్రియా పదము (*parangellō*) క్రొత్త నిబంధనలో ముప్పది పర్యాయములు కంటె ఎక్కువగా అగుపించుచున్నది, మరియు అది నానావిధములుగా అనువదింపబడినది. అదొక సైనిక, చట్టబద్ధ, నైతిక, వైద్య సంబంధమైన పదముగాను, అంగీకరింపబడిన ప్రమాణములు లేక సాంకేతిక పరిజ్ఞానముల ఉల్లేఖన సందర్భములోను ప్రయోగింపబడినది. దానిలో అవశ్యముగా పాలనీయమైన అనివార్య కార్యము దాగియున్నది. ఆజ్ఞాపింపబడుచుండిన వాడు విధేయుడై యుండునట్లు సవాలుచేయబడుచుండెను.

యేసు, **మీరు అన్యజనుల దారిలోనికి వెళ్లకుడి, సమరయుల యే పట్టణములోనైనను ప్రవేశింపకుడి గాని ఇశ్రాయేలు వంశములోని నశించిన గొఱ్ఱెల యొద్దకే వెళ్లుడి** అని ఆ పన్నెండు మందికి ఆజ్ఞాపించాడు. ఈ నిర్బంధము సువార్తలలో మరెచ్చోటనైనను పునఃరుక్తము గావింపబడలేదు. ఆయన పంపించిన డెబ్బది మంది విషయంలో నైనను ఇది అవసరమైనదై యుండలేదు. యేసు తన అపొస్తలులను "తాను వెళ్లబోవు ప్రతి ఊరికిని ప్రతి చోటికిని తన కంటె ముందు" పంపుచుండెను (లూకా 10:1). ఆయన అపొస్తలులపై విధించిన నిర్బంధము, ఆయన తన సొంత మహత్కార్యమును వర్ణించిన విధానమునకు సరిపోయినది. "ఇశ్రాయేలు ఇంటివారైన నశించిన గొఱ్ఱెల యొద్దకే గాని

మరి ఎవరి యొద్దకును నేను పంపబడలేదు" అని ఆయన సెలవిచ్చాడు (15:24). దేవుని ప్రజలు కొండల మీద చెదరిపోయియున్న గొఱ్ఱెల వలె ఉన్నారని ఈ రూపకాలంకారము చిత్రీకరించుచున్నది (యెషయా 53:6; యిర్మీయా 50:6; యెహెజ్కేలు 34:11–16; 1 పేతురు 2:25 చూడు). "మరల తోలుకొని రాబడుట"ను రాబర్ట్ హెచ్. మౌన్స్ "మెస్సీయ యుగ సంబంధిత అరుణోదయము"గా పరిగణించుచున్నాడు.[13]

వారు యూదా ప్రజల మధ్యకు మాత్రమే వెళ్లునట్లు యేసు ఇచ్చిన మార్గనిర్దేశనములు పన్నెండు మందిని నిర్బంధించాయి. దీని గూర్చి విల్యమ్ బార్క్లే ఇలా వ్యాఖ్యానించుచున్నాడు, "వారు ఉత్తర దిశగా సిరియా దేశములోనికి వెళ్లక తూర్పు దిశగా, ఎక్కువగా అన్యజనులు నివసించుచుండిన ప్రాంతమై యుండిన దెకపొలి ప్రాంతము లోనికి కూడ వెళ్లలేకపోయారు."[14] దక్షిణ దిశగా వెళ్లి, "సమరయుల ఏ పట్టణములోనైనను ప్రవేశించుటకు" కూడ వారు నిషేధింపబడిరి. "పన్నెండు మంది యొక్క తొలి ప్రయాణమును గలిలయ ప్రాంతమునకే పరిమితము చేయుట, ఈ ఉత్తరువు యొక్క ఉద్దేశింపబడిన ఉపయుక్తమై యున్నది."[15] 10:23లో, వారు "ఇశ్రాయేలు పట్టణములలో సంచారము చేయుదురని" యేసు సెలవిచ్చాడు, అలాగైతే ఈ విస్తీర్ణత గలిలయను మించిన ప్రాంతమును కలుపుకొనినదై యుండును.

అపొస్తలులపై ఈ నిర్బంధములు విధింపబడుటకు హేతువులేమైయుండును? దీనికి అనేక సమాధానములు ఇయ్యబడవచ్చును. (1) యూదులు మరియు అన్యజనుల మధ్య, యూదులు మరియు సమరయుల మధ్య నెలకొని యుండిన పూర్వాభిప్రాయము[16] బహు గొప్పదై యుండెను. సహజంగానే, సమస్త జనులకు రక్షణ తెచ్చుటయే యేసు యొక్క మహత్కార్యమై యుండినదని ఒకడు జ్ఞాపకముంచుకొనవలెను. ఎట్టకేలకు ఆయన తన అపొస్తలులను "సర్వలోకము లోనికి" మరియు "సర్వసృష్టికి" పంపించాడు (28:19; మార్కు 16:15). (2) యూదులు ఎక్కువగా రానైయుండిన రాజ్యము కొరకు సిద్ధముగా నుండిన పొలములలోనికి మాత్రమే పంపబడుట" ఉత్తమమైన పనై యుండినది.[17] (3) అపొస్తలుల సమయము పరిమితమైనదై యుండినది గనుక వారు ఈ సమయంలో వెళ్లవలసి యుండిన ఇశ్రాయేలు పట్టణములన్నిటినైనను సందర్శింపలేకపోయారు. (4) రక్షణ "మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి" కూడ కలుగజేయబడవలసినదై యుండినది (రోమీయులకు 1:16). సువార్తను వినగల భాగ్యము మొదట యూదులకు లభించనంతవరకు అది అన్యజనులకు ప్రబోధింపబడలేదు (అపొస్తలుల కార్యములు 10).

**వచనము 7.** అపొస్తలులకు వారు నిర్వర్తించవలసి యుండిన బృహత్కార్యభారము మాత్రమే అప్పగింపబడలేదు, కానీ వారు ప్రబోధింపవలసి యుండిన శుభవర్తమానము కూడ తెలియజెప్పబడినది. వారు **బోధించుటకు** బయలువెళ్లినప్పుడు, **పరలోక రాజ్యము సమీపించి యున్నదని** వారు ప్రజలకు తెలియజెప్పవలసి యుండినది. ఇది వారి ప్రధాన సందేశమై యుండగా, వారు నిస్సందేహముగా దాని గూర్చిన యింకా ఎక్కువ వివరములు తెలియజెప్పియుందురు. శిష్యులు సందేశము కూడ ప్రధానంగా బాప్తిస్మమిచ్చు యోహాను మరియు యేసు బోధించిన అదే సందేశమై యుండినది (3:2; 4:17పై గల వ్యాఖ్యానములను చూడు). పరలోక రాజ్యము "సమీపించి యున్నది" అని చెప్పుటలో, రాజ్యము యింకా రాలేదు, కానీ త్వరలోనే రానైయున్నదను అర్థము ఇమిడి యుండినది. ఈ

ప్రకటన ఘోషింపబడిన కొన్ని సంవత్సరములు తరువాత, యేసు ప్రవచనముల ప్రకారము, రాజ్యము – బలముతో – రానేవచ్చింది (మార్కు 9:1; అపొస్తలుల కార్యములు 1:8; 2:1-4, 29–36). రాజ్యము యింకా రాలేదని ఒకడు చెప్పుట, లేదా అది అటుతరువాత భవిష్యత్తులో రాబోవుచున్నదని ఉపదేశించుట, క్రొత్త నిబంధన వెల్లడిచేయుచున్న ప్రామాణికమైన ఉపదేశములను కాదనుటయే ఔతుంది (1 కొరింథీయులకు 15:24, 25; కొలొస్సయులకు 1:13; హెబ్రీయులకు 12:28–29; ప్రకటన 1:9; 6:10పై గల వ్యాఖ్యానములను చూడు).

**వచనము 8.** అపొస్తలులు సువార్తను బోధించుట మాత్రమే కాదు, కానీ సువార్త తెలియజెప్పుచున్న కనికరమును ప్రదర్శించుచు, వాటి సత్యసంధత్వము గూర్చిన నిశ్చయతను సమకూర్చు అద్భుత కార్యములు కూడ చేయవలసి యుండినది వారు **రోగులను స్వస్థపరచుట, చనిపోయినవారిని లేపుట, కుష్ఠరోగులను శుద్ధులనుగా చేయుట,** [మరియు] **దయ్యములను వెళ్లగొట్టుట మొదలగు అద్భుత కార్యములు చేయవలసి** యుండినది. యేసు ఇట్టి అద్భుతకార్యములను అదివరకే చేసాడు, ఆయన రోగులను స్వస్థపరచాడు (4:23, 24; 8:5–16; 9:1–8, 20–22, 27–31, 35), చనిపోయినవారిని లేపాడు (9:18–26), ఒక కుష్ఠురోగిని శుద్ధునిగా చేసాడు (8:1–4), మరియు దయ్యములను వెళ్లగొట్టాడు (4:24; 8:16, 28–34; 9:32–34). గనుక అపొస్తలులు కూడ యేసు అడుగుజాడల్లో నడుచుకొందురు.

అపొస్తలులు అందించుచుండిన సందేశమును రూఢిపర్చు సూచనలుగా ఈ అద్భుత కార్యములు ప్రయోజనపడును (మార్కు 16:17, 18; హెబ్రీయులకు 2:3, 4). అవి వారు శక్తిని ప్రదర్శింపవలెనను ఉద్దేశము కొరకు మాత్రమే చేయకూడదు. దాని బదులుగా, వారు బోధించుచుండిన సందేశమును వారు దేవుని నుండి పొందిరని ధ్రువపర్చు నిమిత్తము అవి చేయబడినవి. పన్నెండు మంది – అటుతరువాత, డెబ్బది మంది – నిజముగా రోగులను స్వస్థపరచగలిగారనియు, దయ్యములను వెళ్లగొట్టగలిగారనియు ఇతర సువార్తల ద్వారా స్పష్టమగుచున్నది (మార్కు 6:12, 13; లూకా 9:6; 10:17). ఇంకా, అపొస్తలుల కార్యముల పుస్తకములో అపొస్తలులు చనిపోయిన ఇరువురిని లేపిన రెండు ఉదాహరణములు గ్రంథస్థం చేయబడి యున్నవి (అపొస్తలులు కార్యములు 9:36–43; 20:9–12).

**ఉచితముగా పొందితిరి, ఉచితముగా ఇయ్యుడి** అని యేసు తన శిష్యులతో చెప్పాడు. వారు సొమ్మేమియు చెల్లింపకుండానే ఈ ఆశ్చర్యజనకమైన శక్తి వారికియ్యబడినది. అది వారికి ఉచితముగా వినియోగించుకొనవలసి యుండిరి. వారికి గొప్ప శక్తులున్నవనుచు వంచకులు నటించుచుండిరి, అంతమాత్రమే గాక వారు ఇట్టి వంచనలను వారి స్వప్రయోజనము కొరకు ప్రయోగించుచుండిరి (7:15–23 చూడు). గారడీవాడైన సీమోను మరియు ఎలుమ (బర్ యేసు) ఈ కోవకు చెందిన వారే (అపొస్తలుల కార్యములు 8:9–13, 18–24; 13:6–12). సువార్తికులు వారు పొందవలసిన పోషణకు అర్హులై యున్నారు (10:10; 1 కొరింథీయులకు 9:8–14), కానీ వారు తమ సేవలను అమ్ముకొనకూడదు. పెద్దలుగా తమ సేవలనందించువారు “ధనాపేక్షలేనివారై” యుండవలెను (1 తిమోతి 3:3) మరియు “దుర్లాభము అపేక్షించనివాడై” యుండవలెను (తీతు 1:7; 1 పేతురు 5:2 చూడు).

**వచనములు 9, 10.** వారు చేయుచుండిన సేవలకు అపొస్తలులు ఎంతటి రుసుమునైనను విధించకూడదు, సరికదా వారి సొంత ఖర్చుల నిమిత్తమైనను వారు ధనమును కూడబెట్టుకొనకూడదు. **మీ సంచులలో బంగారమునైనను, వెండినైనను, రాగినైనను, సిద్ధపరచుకొనకుడి** అని యేసు సెలవిచ్చాడు. ఈ సందర్భములో, "బంగారము," "వెండి," మరియు "రాగి" వెవ్వేరు రకములైన నాణెములను సూచించుచున్నవి బంగారము అత్యంత విలువైనది, రాగి, అతి తక్కువ విలువైనది. "సంచులు" (డబ్బు సంచులు), "నడుముకు కట్టుకొనబడి యుండు దట్టీలోనికి డబ్బు దోపుకొని దాచుకొనబడుచుండిన ప్రాచీన వాడుకను" సూచించుచున్నవి.[18]

**ప్రయాణము కొరకు జాలెనైనను** తీసికొని వెళ్లకూడదని కూడ అపొస్తలులు ఆదేశింపబడిరి. "సంచి" అని అర్థమిచ్చు పదము (*pēra*), బిచ్చగాళ్లు వారికియ్యబడి దానధర్మమును దాచుకొను ఒక విధమైన తోలు/బట్ట సంచిని సూచింపవచ్చును. ఈ డబ్బు సంచి గూర్చి యేసు అదివరకే పేర్కొనినందునుబట్టి, ఆయన ఇప్పుడు సాధారణముగా భోజనము తీసికొని వెళ్లబడుచుండిన సంచి గూర్చి ప్రస్తావించి యుండవచ్చును.[19] మార్కు మరియు లూకా సువార్తికులు చెప్పుచున్నదాని ప్రకారము, ఈ పన్నెండు మంది శిష్యులు వారితో కూడ రొట్టెనైనను, సొమ్మునైనను తీసికొని వెళ్లకూడదు (మార్కు 6:8; లూకా 9:3). వారు ఎటువంటి ఆహారమునైనను మరియు ఆహారము కొనుక్కొనుటకు సొమ్మునైనను వారితో కూడ తీసికొనకుండానే, బయలుదేరవలెను. అనగా వారు పూర్తిగా దేవుని మీదనే మరియు ఇతరుల ఔదార్యము మీదనే ఆధారపడవలసినవారై యుండిరి.[20]

వారు **రెండు అంగీలనైనను, చెప్పులనైనను, చేతి కఱ్ఱనైనను తీసికొని వెళ్లకూడదని** యేసు వారికి ఆజ్ఞాపించాడు, ఇవి వారి బృహత్కార్యము తాత్కాలికమైనదని చూపించుచున్నవి. "అంగీలు" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*chitōn*) బిగుతైన లోపలి ఉడుపు అని (NRSV) లేదా "చొక్కాయిలు" (5:40పై గల వ్యాఖ్యానములను చూడు) అని అనువదించుకొంటే బాగుంటుంది. "చెప్పులనైనను" తీసికొనివెళ్లకూడదని యేసు చెప్పినప్పుడు, వారు కాళ్లకు చెప్పులు లేకుండనే వెళ్లాలని ఆయన ఉద్దేశించి యుండునా? సరికదా, వారు "చెప్పులు" తొడుగుకొనవలెనని మార్కు 6:9 చెప్పుచున్నది దీనికి ప్రతికూలంగా నున్నది. విషయమేమనగా, చెప్పుల విషయంలో మత్తయి మరియు మార్కు వాడుచున్న పదములు భిన్నమైనవై యున్నవి. మత్తయి వాడుచున్న పదము *hupodēma* "పాదరక్షలను" (బూట్లు) సూచించుచున్నది, మార్కు ఉపయోగించిన పదము *sandalion* "కాలిజోడును" (చెప్పులు) సూచించుచున్నది.[21] వీటితో నిమిత్తము లేకుండా, వారు వస్త్రములుగాని లేక కాలిజోళ్లు గాని *అదనంగా* తీసికొని వెళ్లకూడదనునది దాని అభిప్రాయమై యున్నది, కానీ వారు అదివరకే దేహముపై మరియు కాళ్లకు ధరించియుండిన వాటితో మాత్రమే బయల్దేరి వెళ్లవలెనని అర్థమిచ్చుచున్నది. వారు ఒక్క చేతికఱ్ఱను మాత్రమే (మార్కు 6:8) తీసికొనివెళ్లవలెనని యేసు చెప్పాడు. ఈ చేతికఱ్ఱ వారి (ఆత్మ) ప్రతిరక్షణ లేకుండా యేసు వారిని పంపలేదు. కాలిజోడు మరియు చేతికఱ్ఱ ప్రయాణంలో అవసరమై యుండిన మౌలిక అవశ్యకములై యుండినవి (నిర్గమకాండము 12:11).

యేసు సన్యాసి జీవిత విధానమునకు ప్రోత్సాహకమియ్యలేదు దానికి బదులుగా వారు దేవుని మీదనే ఆధారపడవలెనని ఆయన తన శిష్యులకు ఉపదేశించాడు.[22] అటుతరువాత,

మహా ఆదేశము కొరకు సిద్ధపాటుగా, ఈ నిషేధములు యేసు చేత నిరసింపబడినవి (లూకా 22:35, 36).

ఈ ఆదేశములను ఇచ్చిన తరువాత, **పనివాడు తన ఆహారమునకు పాత్రుడు** అని యేసు ప్రభువు వివరించాడు. "పోషణ" అని అర్థమిచ్చు పదము (*trophē*), "ఆహారము" అని ఎక్కువగా అక్షరార్థముగా అనువదింపబడవచ్చును (ASV; NKJV; NRSV). ఇవే మాటలు యేసు డెబ్బది మందిని పంపించిన సందర్భములో, లూకా సువార్తలో కూడ అగుపించును (లూకా 10:7). ఏదిఏమైనా, అచ్చట "జీతము" (*misthos*) అను పదము వాడబడినది.

అపొస్తలులు వారి సేవలను అమ్ముకొనకూడదని ఆదేశింపబడి యుండగా, వారు పరిచర్య చేయు ప్రజల చేత పోషింపబడవలసి యుండినది. వారి బ్రతుకు తెరువు నిమిత్తము వారు దేవుని మీదను, ఆయన ప్రజల మీదను ఆధారపడుదురు. ఈ అవసరత నేటికిని అమలులో ఉన్నది, ఏలయనగా ఇదే ఆజ్ఞను పౌలు దేవుని సంఘ సభ్యులకు జారీ చేసాడు (1 కొరింథీయులకు 9:8–14; గలతీయులకు 6:6). తొలి శతాబ్దము నాటి సువార్తికులు మాత్రమే పోషింపబడవలసినవారు కాదు, కానీ "పూర్తి కాలము" సేవలనందించుచుండిన సంఘ పెద్దలు సహితము "రెట్టింపు సన్మానమునకు పాత్రులుగా" ఎంచబడవలసినవారై యుండిరి (వారి) "జీతమునకు" వారు పాత్రులై యుండిరి (1 తిమోతి 5:17, 18).

**వచనము 11. ఏ పట్టణములోనైనను, ఏ గ్రామములోనైనను** అను మాటల ప్రస్తావన, "సమస్త పట్టణముల యందును, గ్రామములయందును" వెళ్లిన యేసు, ఉపదేశించుచు స్వస్థపరచుచుండిన పరిచర్యను గుర్తుచేయుచున్నది (9:35). అపొస్తలులు సువార్తను బోధించుచుండిన సందర్భములో ఆ యా స్థలములను సందర్శించినప్పుడు, వారు పేరుప్రతిష్టలుగలవారి యొద్ద బసచేయవలసి యుండినది. **పాత్రుడు** (*axios*) అను విశేషణము, 10వ వచనంలో కూడ ఈ పదము కనబడుచున్నది, తగిన వానిని లేక యోగ్యుడైనవానిని సూచించుచున్నది. ఇటువంటివారు పరులను దయతో వారి ఇంట ఆదరించెడువారును, అపొస్తులుల సందేశములను ఆదారముతో స్వీకరించువారునై – అనగా, ఉన్నతమైన నైతిక మరియు ఆధ్యాత్మిక స్వభావముగలవారై – యుండవలెను. అవినీతిపరుల యొద్ద బసచేయుట వలన వారి బృహత్కార్యము సంకటావస్థకు గురియగును.

బసచేయుటకు యోగ్యుడైనవాడు లభించిన తరువాత, వారు **ఆ పట్టణమును** సందర్శించు పని సంపూర్తిగా పూర్తయ్యే వరకు **అచ్చోటనే బసచేయుచుండవలెను**. పూర్వపు బస కంటె మెరుగైన దాని కొరకు వెదకుటకు – "ఇంటింటికి తిరుగుటకు" (లూకా 10:7) – బదులుగా, వారున్నచోటనే సంతృప్తి చెందుచు వారి బసను కొనసాగించవలెను. ఇది అతిథిని ఆదుకునే మనిషి యెడల మర్యాద ప్రదర్శించినట్లవుతోంది.

అతిథ్యం ఉచితముగా అందించబడవలెనని ఆశించుట ఆ సమయము సంస్కృతికి అనుచితమైన అంశము కాదు.[23] క్రైస్తవ అతిథ్యం క్రొత్త నిబంధనయందంతటను ఆజ్ఞాపింపబడినదియు, సోదాహరణంగా వర్ణింపబడినదియునై యున్నది (రోమీయులకు 12:13; 1 తిమోతి 3:2–3; తీతు 1:8; హెబ్రీయులకు 13:1; 1 పేతురు 4:9; 3 యోహాను 5–8).[24]

**వచనము 12, 13.** వారు ఒకరి **ఇంటిలోనికి** ప్రవేశించినప్పుడు చెప్పవలసిన

వివరమేమిటో కూడ యేసు తన శిష్యులకు ఉపదేశించాడు. ఈ సందర్భములో, ఆంగ్ల వ్యాకరణములోని భాగము "the house," ప్రాధాన్యతను సంతరించుకొనుచున్నది. వారు "ఆ ఇంటివారికి," ఇంతకు మునుపే వర్ణింపబడిన ఇంటివారికి, వారు **శుభమును** చెప్పవలసి యున్నది. సాంప్రదాయబద్ధమైన యూదా అభివందనము *Shalom,* లేక "సమాధానము [నీకు కలుగును గాక]" అయియుండినది (న్యాయాధిపతులు 19:20; 1 సమూయేలు 25:6; కీర్తనలు 122:7, 8; యోహాను 20:19, 21, 26 చూడు). బలమైన ఈ పదము "సమాధానము," "సంక్షేమము," "ఆరోగ్యము," మరియు "సౌభాగ్య సమృద్ధి"ని సూచించుచున్నది. ఈ వచనములును JNT భాషాంతరీకరణము ఇలా అనువదించుచున్నది: "నీవు ఎవరైన ఒకరి ఇంటిలోపలకు ప్రవేశించినప్పుడు, '*Shalom aleikhem* [నీకు/మీకు సమాధానము కలుగును గాక]!' అని చెప్పవలెను. మీ శుభాభివందన వచనమునకు ఆ ఇంటివారు యోగ్యులైనట్లయితే, మీరందించిన *shalom* [సమాధానము] ఆ ఇంటిమీద నిలిచియుండును లేనట్లయితే, ఆ *shalom* [సమాధానము] మరలా మీ యొద్దకే మరలి వచ్చును." రెండు వెవ్వేరు పరిస్థితులు తన కంటికి ఎదురుగా ఉన్నట్లు యేసు ఊహించుకొన్నాడు, ఒక పరిస్థితిలో ఆ **ఇంటివారు యోగ్యులని** అపొస్తలులు నిక్కచ్చిగా నిర్ణయించుకొందురు మరియు మరొక పరిస్థితిలో వారి గూర్చి మరొక విధంగా (వారు యోగ్యులు కారని) నిర్ణయించుకొందురు. మొదటి దృశ్యవివరణలో, వారి **సమాధానాశీర్వాదము** ఆ ఇంటి మీద నిలిచియుండును. రెండవ దానిలో, వారు దానిని వెనుకకు తీసికొందురు.

**వచనము 14.** అపొస్తలులు ఒక **ఇంటిలో** గాని లేదా ఒక **పట్టణములో** గాని తృణీకారమును ఎదుర్కొనినప్పుడెల్లా, వారు తమ పాదధూళిని దులిపివేయవలసి యుండినది. డేవిడ్ హిల్ ఇలా వ్రాయుచున్నాడు, "ఇంటితో గాని, పట్టణముతో గాని ఉన్న సంబంధము గూర్చి ఎటువంటి జాడయైనను నిలిచియుండకూడదు."[25] అసలు ఆ చర్యయే అనగా, పాదధూళి దులిపివేయుటయే ఒకడు "అనాగరికమైన ఆరాధనా పద్ధతులను అనుసరించువారి" నేలపై నిలువబడియున్నాడని తెలియజెప్పుచుండిన ఒక విధానమై యుండినది.[26] యూదులు ఏదైన ఒక అన్యజనుల ప్రాంతము గుండా పయనించినప్పుడు, అన్యజనుల దేశము యొక్క అపవిత్రమైన ధూళితో తమ స్వదేశమును మాలిన్యము చేసినవారౌదురు భయమునుబట్టి (ఆమోసు 7:17 చూడు), వాడుకగా వారి పాద ధూళిని దులిపివేసుకొనిన తరువాతనే వారి స్వస్థలమునకు తిరిగి వచ్చుచుండిరి.[27] పౌలు మరియు బర్నబా పిసిదియలోని అంతియొకయలో నుండిన యూదుల చేత తృణీకరింపబడినప్పుడు వారి పాదధూళి దులిపివేసుకొన్నారు (అపొస్తలుల కార్యములు 13:50, 51). కొరింథులోని యూదులు పౌలును "ఎదురాడి ఆయనను దూషించినప్పుడు" పౌలు "మీ నాశనమునకు మీరే ఉత్తరవాదులు! నేను నిర్దోషిని. యికమీదట అన్యజనుల యొద్దకు పోవుదునని" పలుకుచు, వారికి వ్యతిరేకముగా తన వస్త్రములను దులిపివేసికొన్నాడు (అపొస్తలుల కార్యములు 18:6). ప్రస్తుత విషయంలో, సాంకేతికముగా అపొస్తలులు చేపట్టుచున్న చర్య "తృణీకరించువారికి వ్యతిరేకముగా నుండు ఒక సాక్ష్యముగా" కూడ పనికివచ్చును (మార్కు 6:11).

**వచనము 15. విమర్శదినమందు ఆ పట్టణపు,** అనగా ఆయన ఆపొస్తలులను

తృణీకరించిన ఏ పట్టణమైనను అని అర్థము, **గతి కంటె సొదొమ గొమొఱ్ఱా ప్రదేశముల గతి ఓర్వదగినదై యుండునని** యేసు సెలవిచ్చాడు (11:20-24పైగల వ్యాఖ్యానములను చూడు). "ఎక్కువ ఓర్వదగినదై యుండును" అను మాటలు, "ఆయనను తృణీకరించు పట్టణముల మీదికి వచ్చు భయభీతిని గొలుపు ఖండనను వెల్లడి చేయుటకు" యేసు ప్రయోగించిన ఒక పదజాలమై యున్నది.[28] సొదొమ గొమొఱ్ఱా పట్టణములు దేవుని చేత నాశనము చేయబడిన "దుర్మార్గతకు పేరుపడిన పట్టణములై" యుండినవి.[29]

అవకాశము, బాధ్యతతో సమానమైనదనునది యేసు ఘోషించిన ప్రకటనలోని ముఖ్య విషయమై యున్నది (లూకా 12:48 చూడు). యేసు రోజుల్లో ఉండిన పట్టణములు సొదొమ గొమొఱ్ఱా పట్టణముల కంటె విశ్వసించుటకు మరియు మారుమనస్సు నొందుటకు గొప్ప అవకాశములు కలిగియుండినవి కాబట్టి, ఆ పట్టణముల విషయంలో తీర్పు యింకా ఎక్కువ కఠినమైనదై యుండును. దేవుని తీర్పు ఇతరుల కంటె కొందరికి ఎలా ఎక్కువగా ఓర్వతగినదై యుంటుంది? యేసు బోధించిన సువార్తను తృణీకరించినవారు పాత నిబంధనలోని దుర్మార్గపు పట్టణముల కంటె గొప్ప అవకాశములు కలిగియుండిరి. అపొస్తలులు సువార్త ప్రకటించిన పట్టణములు మరియు గ్రామముల కంటె సొదొమ మరియు గొమొఱ్ఱా పట్టణములు తక్కువ దుర్మార్గమైనవని ఎందుకు పరిగణింపబడినవి? ఇందుకు అజ్ఞానమే హేతువై యుండును. యేసు రోజుల్లోని పట్టణములు యేసుక్రీస్తు యొక్క పరిచర్య ప్రసారము చేసిన గొప్ప వెలుగునకు విరోధముగా పాపము చేసాయి.[30]

### పన్నెండుగురు శిష్యులకియ్యబడిన హెచ్చరికలు (10:16-23)

**16ఇదిగో తోడేళ్లమధ్యకు గొఱ్ఱెలను పంపినట్టు నేను మిమ్మును పంపుచున్నాను గనుక పాములవలె వివేకులును పావురములవలె నిష్కపటులునై యుండుడి. 17మనుష్యులనుగూర్చి జాగ్రత్తపడుడి; వారు మిమ్మును మహాసభలకు అప్పగించి, తమ సమాజమందిరములలో మిమ్మును కొరడాలతో కొట్టింతురు. 18వీరికిని అన్యజనులకును సాక్ష్యార్థమై నానిమిత్తము మీరు అధిపతులయొద్దకును రాజులయొద్దకును తేబడుదురు. 19వారు మిమ్మును అప్పగించునప్పుడు, -ఏలాగు మాటాడుదుము? ఏమి చెప్పుదుము? అని చింతింపకుడి మీరేమి చెప్పవలెనో అది ఆ గడియలోనే మీకనుగ్రహింపబడును. 20మీ తండ్రి ఆత్మ మీలో ఉండి మాటలాడుచున్నాడే గాని మాటలాడువారు మీరు కారు. 21సహోదరుడు సహోదరుని, తండ్రి కుమారుని, మరణమునకు అప్పగించెదరు; పిల్లలు తలిదండ్రులమీద లేచి వారిని చంపించెదరు. 22మీరు నా నామము నిమిత్తము అందరిచేత ద్వేషింపబడుదురు; అంతమువరకును సహించినవాడు రక్షింపబడును. 23వారు ఈ పట్టణములో మిమ్మును హింసించునప్పుడు మరియొక పట్టణమునకు పారిపోవుడి; మనుష్యకుమారుడు వచ్చువరకు మీరు ఇశ్రాయేలు పట్టణములలో సంచారము చేసియుండరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను.**

యేసు పరిచర్య ప్రారంభమయ్యింది మొదలుకొని, ప్రజలు ఆయనను వ్యతిరేకించుచునే యుండిరి. ఆయన తన అపొస్తలులను నియమించుకొని వారిని బృహత్కార్యార్థమై పంపినప్పుడు, వారు కూడ ఆయన ఎదుర్కొనిన అదే విధమైన విరోధమును ఎదుర్కొందురని

ఆయన వారిని హెచ్చరించాడు. శిష్యులు ఎదుర్కొననై యుండిన హింసలు, వారికీయబడు నేతృత్వము, మరియు వారు శత్రుభావముగల ఒక పట్టణములో నిలిచియుండుటకు బదులుగా అచ్చోట నుండి పారిపోవలసిన పరిస్థితులు 16 మొదలుకొని 23 వరకు గల వచనములు వర్ణించుచున్నవి.

**వచనము 16. ఇదిగో తోడేళ్ల మధ్యకు గొఱ్ఱెలను పంపినట్లు నేను మిమ్మును పంపుచున్నాను** అని యేసు చెప్పాడు. "గొఱ్ఱెలు" అత్యధికంగా పరాధీనతకు పాల్పడు జంతువులై యున్నవి. స్వతస్సిద్ధమైన ప్రతిరక్షణ గూర్చిన తెలివి లేనందునుబట్టి, అవి నిస్సహాయమైనవై అతి సులభంగా భయపడునవై యున్నవి. పాలస్తీనాలో "తోడేళ్లు" వాటి ఘోరమైన శత్రువులై యుండినవి. యేసు ఇచ్చట జంతువుల గూర్చి మాటలాడలేదు, కానీ ప్రజలు కొన్ని పర్యాయములు ఎలా ప్రవర్తిస్తారో తెలియజెప్పుటకు ఆయన వాటిని కేవలము సోదాహరణ దృష్టాంతములుగా ఉపయోగించుచుండెను. ఆయన అపొస్తలులు గొఱ్ఱెలై యుండిరి. వారి శత్రువులు తోడేళ్లై యుండిరి. విల్కిన్స్ ఇలా సూచించాడు, "యేసు ఈ రూపకాలంకారమును తారుమారు చేయుచున్నాడు. దీనికి మునుపు శిష్యులు గొఱ్ఱెల యొద్దకు వెళ్లవలసినవారై యుండిరి (9:36; 10:6), కానీ ఇప్పుడు వారే తోడేళ్ల మధ్యకు వెళ్లుచున్న గొఱ్ఱెలై యుంటున్నారు."[31] ఈ పన్నెండుగురు ఇప్పుడు దొంగిలించి దోపిడీ చేయబడు లోకము లోనికి పంపబడుచున్నారు (7:15; యోహాను 10:10, 12; అపొస్తలుల కార్యములు 20:29 చూడు). వారు క్రీస్తునకు శత్రువులై యున్న ప్రతి ఒక్కరి చేత ఒక ఎరగా వెదకి వెంటాడబడుచుందురు.

ఇది వాస్తవమై యుండినది, గనుకనే **పాములవలె వివేకులును (వివేకులును** CEV) **పావురములవలె నిష్కపటులునై యుండుడి** అంటూ యేసు వారిని మందలించాడు. బహుశా ఈ భాషాప్రయోగము లోకప్రసిద్ధమైన సామెత రూపమై యుండవచ్చును. యూదా మత బోధకుల సాహిత్యములో, ఇటువంటిదే ఒక నానుడి దేవునికి ఆరోపింపబడినది. ఇశ్రాయేలు గూర్చి చెప్పుచూ, "నా దృష్టిలో వారు పావురముల వలె నిష్కపటులునై యున్నారు, కానీ ప్రజల దృష్టిలో వారు పాములవలె టక్కరులై యున్నారని" ఆయన సెలవిచ్చాడు.[32] పావురములు, సాధ్యమైనంత వరకు నోవహు కాలములో నుండియే, సమాధానము, అమాయకత్వము, మరియు పవిత్రతకు చిహ్నములుగా పరిగణింపబడినవి. అవి స్వయం ప్రతిరక్షణ ఏమియు లేని జీవులై యుండి తస్కరుల చేతులకు అతి సులభంగా దొరికిపోవుచుండినవి. "పాములు," ఆది దినముల నుండే, వాటి కపటము మరియు జ్ఞానమునకు ప్రసిద్ధికెక్కినవై యుంటున్నవి (ఆదికాండము 3:1 చూడు) అనేక పాములు విషపూరితమైనవి మరియు అత్యంత అపాయకరమైనవై యుంటున్నవి. "సామెత రూపంలో పాములకు అపాదింపబడిన జ్ఞానము యేసు శిష్యులకు ఎంతో అవశ్యకమై యుంటున్నది, కానీ వంచించు టక్కరితనము మరియు విశ్వాసఘాతుకత్వముగల మాయోపాయములు స్థానం, ప్రమాదరహితము మరియు పావురములకు ఆరోపింపబడిన సాధువైన అమాయకత్వముతో నింపబడవలెను."[33]

వారు సైనిక చర్యలు చేపట్టువారి వలె ప్రవర్తింపకూడదు, కానీ ఇతర ప్రజలతో వ్యవహరించునప్పుడు జ్ఞానము కలిగి మెలగుచుండవలెను. వారికి అనివార్యముగా ఎదురయ్యే వ్యతిరేకత వారు ఎరిగినవారై యుండవలెను, మరియు ఇటువంటి పరిస్థితుల పట్ల నిర్మాణాత్మకమైన రీతిలో వ్యవహరించుటకు సంసిద్ధులై యుండవలెను. దేవుని రాజ్యము

ఐహిక సంబంధమైన యుద్ధోపకరణము వంటి కత్తి చేత బూని విస్తరింపజేయవలసిన విషయము కాదు, కానీ "దేవుని వాక్యమను ఆత్మ ఖడ్గము" చేత వ్యాపింపజేయబడవలెను (ఎఫెసీయులకు 6:17; మత్తయి 26:51–54; యోహాను 18:36; హెబ్రీయులకు 4:12 చూడు).

నానావిధములైన గుంపులకు చెందినవారు అపొస్తలులకు శత్రువులౌదురు. వ్యతిరేకత మూడు దిశలనుండి ఎదురౌతోంది: మతపరమైన వ్యవస్థలు (10:17), పౌరసంబంధమైన అధికారులు (10:18), మరియు కుటుంబ సభ్యులు (10:21).

**వచనము 17.** మొదటిగా, వ్యతిరేకత మతపరమైన వ్యవస్థల నుండి వచ్చును. యేసు, **మనుష్యులను గూర్చి జాగ్రత్తపడుడి, ఏలయనగా వారు మిమ్మును మహాసభలకు అప్పగించి, తమ సమాజమందిరములలో మిమ్మును కొరడాలతో కొట్టింతురు** అని తన శిష్యులను హెచ్చరించాడు. మత్తయి పేర్కొనుచున్న ఈ "మహా సభలు" కేవలము పౌర న్యాయస్థానములు కావు. ఈ సమయంలో పన్నెండుగురు శిష్యులు యూదుల పట్టణముల లోనికి మాత్రమే వెళ్లుచుండిరి. ఇశ్రాయేలు, దేవుని చేత పరిపాలింపబడుచుండిన జనాంగమై యుండినది ఆయన మోషే ద్వారా వారికిచ్చిన ధర్మశాస్త్రము, వారి శాసనమై యుండినది. పరిస్థితి ఇలా ఉండినందునుబట్టి, మతపరమైన అధికారులు కూడ పౌర సంబంధమైన విషయాలలో తీర్పు తీర్చుచుండిరి. "మహా సభలు" (*sunedrion*) అను పదము, న్యాయాధిపతులలో ముగ్గురు మాత్రమే తుది తీర్పు తీర్చుటకు అవసరమై యుండినప్పటికిని, ఇరవై ముగ్గురు సభ్యులుండిన స్థానిక యూదా మహాసభను (sanhedrins) సూచించుచున్నది.[34]

> న్యాయస్థానములోని న్యాయాధిపతుల చేత ఒక తుది నిర్ణయము తీసికొనబడిన తరువాత, దోషిగా నిర్ధరింపబడి వాడు న్యాయాధిపతి ముందర పడుకొనబెట్టబడి, కొరడాతో కొట్టబడినాడు. కొట్టబడవలసిన కొరడా దెబ్బల సంఖ్య దోషి చేసిన నేరమునకు తగినట్టుగా సర్దుబాటు చేయబడినప్పటికిని, నియమము ప్రకారము నిర్ణయింపబడిన కొరడా దెబ్బల సంఖ్య నలభై. కానీ నలభై కంటె ఎక్కువ కొరడా దెబ్బలు కొట్టుటకు వీలులేదు, ఏలయనగా నలభై కంటె ఎక్కువ సంఖ్య అమానుషమైనది (ద్వితీయోపదేశకాండము 25:1–3). ఒక వేళ అవి తప్పుగా లెక్కింపబడినప్పటికిని, సామాన్యముగా వర్తింపజేయబడిన కొరడా దెబ్బల సంఖ్య ఒకటి తక్కువ నలభై [Mishnah *Makkoth* 3:2, 10; 2 కొరింథీయులకు 11:24 చూడు].[35]

"సమాజమందిరములు" ఆరాధన స్థలముగా మాత్రమే కాదు, కానీ న్యాయము తీర్చబడిన స్థలములుగా కూడ ఉపయోగించుకొనబడినవి (23:34 చూడు).

**వచనము 18.** రెండవదిగా, వ్యతిరేకత పౌర అధికారుల నుండి ఎదురయ్యింది. **వీరికిని అన్యజనులకును సాక్ష్యార్థమై, నా నిమిత్తము మీరు అధిపతుల యొద్దకును రాజుల యొద్దకును తేబడుదురు** అని యేసు సెలవిచ్చాడు. ఈ హెచ్చరిక ప్రధానంగా మహా ఆదేశము ఇవ్వబడిన పిదప ఆది సంఘములో సంభవింపనై యుండిన సంఘములను సూచించుచు (28:18–20), పరమితమై యుండిన దర్యాప్తు సమితిని మించి పొడిగింపబడినది. అన్యజనులకు సంబంధించిన పరిపాలకుల నుండి ఎదురయ్యే సంఘర్షణ రాజకీయ పరిస్థితిని బట్టి అనివార్యమైనదై యుండినది. యూదులు సొంత మతమునకు సంబంధించిన చట్టపరమైన విషయములలో రోమా ప్రభుత్వము వారికి చెప్పుకోదగ్గ

ఉదారతను అనుమతించినను, ఘోరమైన, మరి ముఖ్యముగా మరణ దండన కలిసియుండిన అభియోగముల విషయంలో (1:19; 12:14) ప్రభావితము చేయగలుగునట్లు వారు అనుమతింపబడలేదు. యూదులు ఈ నిర్బంధమును తరుచుగా ఉల్లంఘించినప్పటికిని, వారు ఈ నిబంధన మేరలోనే పరిపాలింపబడిరి.[36] అపొస్తలుల కార్యముల పుస్తకంలో, యూదుల వలన కలిగిన హింసలు ఫేలిక్సు మరియు ఫేస్తు అను రోమా ప్రభుత్వ "పాలకుల" యెదుట, పౌలుకు తీర్పు తీర్చబడుటకు హేతువయ్యారు (అపొస్తలుల కార్యములు 24; 25). పౌలు, అగ్రిప్ప యెదుట కూడ హాజరయ్యాడు (25:23). ఇటువంటి తీర్పులు ఆది క్రైస్తవులు క్రీస్తు కొరకు సాక్షులుగా నిలుచుటకు వారికి అవకాశములను సమకూర్చాయి.

ఆది క్రైస్తవులకు హింసలు మొదట యూదుల నుండియే కలిగినప్పటికిని, అది అటుతరవాత రోజుల్లో ఎక్కువగా రోమా ప్రభుత్వము చేబూనినదయ్యింది. క్రీ.శ. 64లో నీరో చక్రవర్తి పెట్టిన హింసలకు సంబంధించినంత వరకు, క్రైస్తవులు, "వారి హేయమైన క్రియలనుబట్టి," మరి ముఖ్యముగా "మానవజాతికి విరోధముగా వారిలో ఉండిన ద్వేషమునుబట్టి" "ద్వేషింపబడిన ఒక వర్గమునకు చెందినవారై యుండిరని" టాసిటస్ రచించాడు.[37] వారి యెడల ప్రదర్శింపబడుచుండిన కొంత దుర్భావం, వారికి విరోధముగా మోపబడుచుండిన అపకీర్తిపాలుజేయు అపనిందల వలన కలిగినది. వారు నరమాంసభక్షకత్వము గూర్చి నిందింపబడిరి, ఏలయనగా వారు క్రీస్తు శరీరమును తినుట మరియు ఆయన రక్తమును త్రాగుట గూర్చి చర్చించుకొనుచుండిరి. వారు నీతిబాహ్యమైన విషయాల గూర్చి నిందింపబడిరి, ఏలయనగా వారు ప్రేమ (*agapē*) విందులు ఏర్పాటు చేసికొనుచుండిరి. వారు "ఇళ్లను తగులబెట్టుచు ఆస్తులకు నష్టము కలిగించుచుండిరని" వారిపై నేరారోపణ చేయబడినది, ఏలయనగా వారి బోధకులు లోకాంతమును గూర్చి బోధిస్తూ లోకమంతటిని తగులబడిపోవుచున్న మారణహోమముగా చిత్రీకరించుచుండిరి. వారు రాచభక్తిలేని పౌరులని ఆరోపింపబడిరి, ఏలయనగా కైసరు వారి ప్రభువై యున్నాడని వారు ప్రతిజ్ఞ చేసికొనుటకు లేదా రోమా ప్రభుత్వము యొక్క వైభవము కొరకు పోరాడుటకు నిరాకరించారు. ఇటువంటి నేరారోపణలన్నియు నిరాధారములే అవన్నియు ఎటువంటి యోగ్యతయైనను లేనివే, కానీ పై విషయాలన్నిటిని వారు విశ్వసించారను వాస్తవము హేతువై యుండినది, లేక బహుశా సమర్థనీయతయై యుండినది, ఏలయనగా హింసలలో ఎక్కువ భాగము వారికే కలుగజేయబడినవి.

**వచనములు 19, 20.** ఈ వచనములో గల వాగ్దానము అపొస్తలులకు యివ్వబడినది, క్రైస్తవ యుగమునకు కాదు. అపొస్తలులు నానా విధములైన న్యాయస్థానముల యెదుటికి తీసికొనివెళ్లబడినప్పుడు, వారికి విరోధముగా వారిపై మోపబడుచుండిన అభియోగములకు వారు ఎలా లేక ఏమని సమాధానము **చెప్పవలెనో యని వారు చింతించవలసిన** అవసరం లేకుండినది. యేసు, **మీరేమి చెప్పవలెనో అది ఆ గడియలోనే మీకనుగ్రహింపబడునని** వాగ్దానము చేసాడు. పరిశుద్ధాత్మ ద్వారా లభ్యమగు సహాయము గూర్చి సువార్తలలో వ్రాయబడినది ఇదే తొలి వాగ్దానము (మార్కు 13:11; లూకా 21:14, 15; యోహాను 14:15-17, 26; 15:26, 27; 16:13-15 చూడు). వీరు తమ ప్రతిరక్షణ కొరకు సమాధానములిచ్చుటకు **ఆత్మ చేత** ప్రేరేపింపబడుదురు. ఈ గ్రంథ పాఠము "ఆత్మ ద్వారా అనుగ్రహింపబడి అపొస్తలులను సర్వ సత్యములోనికి నడిపించుట గూర్చి క్రొత్త

నిబంధనలో గల బలమైన ఘోషణలలో ఒకటైయున్నదని" జేమ్స్ బర్టన్ కోఫ్మన్ దీని గూర్చి ప్రస్తావించాడు.[38]

**వచనము 21.** మూడవదిగా, ఒకని సొంత కుటుంబములో నుండి వ్యతిరేకత వచ్చును: **సహోదరుడు సహోదరుని, తండ్రి కుమారుని, మరణమునకు అప్పగించెదరు పిల్లలు తలిదండ్రుల మీద లేచి వారిని చంపించెదరు.** ఈ హెచ్చరిక అందరికి వర్తించునదిగా అగుపించుచున్నది, గనుక అపొస్తలులు వారి సొంత కుటుంబికుల చేత అమర్యాదగాను అగౌరవంగాను చూడబడుచున్నారనుటకు గల నిదర్శనము కనబడుటలేదు. ఏదిఏమైనా, ఇటువంటి సొంత కుటుంబముల నుండి వచ్చు వ్యతిరేకత, క్రీస్తును వెంబడించువారందరికిని అంతర్గతముగా దాగియున్న ఒక బెదిరింపై యున్నది.

"మెస్సీయ వచ్చినప్పుడుండు తరములో యౌవ్వనులు వృద్ధులను అవమానపరచుదురు, ... కుమార్తెలు వారి తల్లులకు విరోధముగాను, కోడండ్రు వారి అత్తలకు వ్యతిరేకముగాను లేతురని కొందరు యూదా మత బోధకులు ఉపదేశించారు."[39] ప్రస్తుత సందర్భములో, కుటుంబ సభ్యులు విశ్వాసులనై కుటుంబ బంధువుల "నమ్మకమును వమ్ముచేయుదురు" (*paradidōmi*) లేక వారు చంపబడునట్లు వారిని అధికారులకు "అప్పగింతురు" (10:17 చూడు).

ప్రజలందరిని ఒక్క తాడు మీదికి తెచ్చుట క్రీస్తు సువార్త ఉద్దేశమై యున్నది, అయితే ప్రజలు సువార్తను తృణీకరించుచున్నందు వలన దాని పర్యవసానముగా కుటుంబములలో సహితము విభజనలు ఏర్పడుచున్నవి. యేసు ఈ విధంగా ఉపదేశించాడు,

> నేను భూమి మీద సమాధానము కలుగజేయవచ్చితినని మీరు తలంచుచున్నారా? కాదు భేదమునే కలుగజేయవచ్చితినని మీతో చెప్పుచున్నాను. ఇప్పటినుండి ఒక ఇంటిలో అయిదుగురు వేరుపడి, ఇద్దరిక విరోధముగా ముగ్గురును, ముగ్గురికి విరోధముగా యిద్దరును ఉందురు. తండ్రి కుమారునికిని, కుమారుడు తండ్రికిని, తల్లి కుమార్తెకును, కుమార్తె తల్లికిని, అత్త కోడలికిని, కోడలు అత్తకును విరోధులుగా ఉందురని చెప్పెను (లూకా 12:51–53; మత్తయి 10:35, 36 చూడు).

**వచనము 22. మీరు నా నామము నిమిత్తము అందరి చేత ద్వేషింపబడుదురు**, అంతము వరకు సహించువాడు రక్షింపబడునని యేసు తన అనుచరులతో చెప్పాడు. ఈ విషయంలో, "అందరు" అను పదమును అక్షరార్థముగా అనువదించకూడదు. అది అతిశయోక్తి గూర్చిన ఒక ఉదాహరణమై యున్నది గనుక అన్ని రకముల, జాతుల, మరియు తరగతులకు చెందిన ప్రజలకు వర్తించును, క్రీస్తు ఆయనే ద్వేషింపబడినందునుబట్టి వారు కూడ ద్వేషింపబడుదురు (యోహాను 15:18–25) లేక వారు ఆయన నామము ధరించియున్నందునుబట్టి అనగా, "క్రైస్తవుడు" అను నామము (1 పేతురు 4:14–16) వారు ద్వేషింపబడుదురనునది, "నా నామమునుబట్టి," లేక "నా నామము నిమిత్తము" అను మాటల అర్థమై యున్నది, "నా నామమును బట్టి" అనునది, "ఇశ్రాయేలు జనాంగము అరాధించుటకు వారి మనస్సును కేంద్రీకరించుచు, ఆయన ఆధీనములో వారి స్వామిభక్తిని ప్రదర్శింపవలసినదైయున్న దేవుని నామము, ఆయన వ్యక్తిత్వమునకు మూర్తిమంతమైయున్నందు వలన పాత నిబంధనలా ఆ నామమునకు గల ప్రాముఖ్యతను మనస్సుకు గుర్తుకు తెచ్చుకొనుచున్న క్రీస్తు శాస్త్రమునకు సంబంధిచిన ఒక ముఖ్యమైన అభివ్యక్తమై యున్నదని (5:11; 24:9 పోల్చి చూడు) విల్కిన్స్

గమనించాడు (ఉదా॥ నిర్గమకాండము 3:15; 6:3; 9:16; 20:7)."[40]

యేసు అనుచరులు ఈ లోకములో అసంతుష్టికరమైన పరిస్థితులను ఎదుర్కొననై యుండినప్పటికిని, యేసు వారికి ఒక ప్రోత్సాహకరమైన వాగ్దానము నిచ్చాడు: **అంతమువరకు సహించినవాడు రక్షింపబడును.** "అంతము" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*telos*) యుగాంతము/అంత్యకాలము గూర్చి నిర్లక్ష్యముగానున్న ఊహాగానాలకు దారి తీసినది. ఈ ఘోషణ ప్రాథమికంగా అపొస్తలులను సూచించుచున్నట్లయితే, యేసు అర్థము ఎలా అంత్యకాలము గూర్చినదౌతోంది? దీనిని మనము యుగములన్నిటికి సంబంధించిన క్రైస్తవులకు అన్వయించినప్పటికిని, వారు రక్షింపబడుటకు అంత్యకాలము వరకు జీవించియుండవలెననునది దాని అర్థమా? నిశ్చయముగా కాదు! ఇచ్చట *telos* అను పదమునకు ఆంగ్ల వ్యాకరణములోని ఉపపదము (ఎ, యాన్, ది) లేదు. అది "అంత్య కాలము వరకు" అని సూచించుట లేదు (24:13; 1 కొరింథీయులకు 13:7; ప్రకటన 3:11 చూడు).[41] "వారి బృహత్కార్యము ముగియు వరకు" అనునది దాని అర్థమై యుండును, కానీ "జీవితము అంతమయ్యే వరకు"[42] అను అర్థము ఎక్కువ సంభావ్యమైనదై యున్నది (ప్రకటన 2:10 చూడు).

**వచనము 23. వారు ఈ పట్టణములో మిమ్మును హింసించినప్పుడు, మరియొక పట్టణమునకు పారిపోవుడి** అంటూ యేసు తన మాటలను కొనసాగించాడు. దాని సందర్భములో, ఈ ప్రకటన యింకా అపొస్తలుల పరిచర్యను ప్రస్తావించుచునే యున్నది. వారు ఏదైన ఒక పట్టణములో సరైన విధంగా సన్మానింపబడనట్లయితే, వారు "తమ పాదధూళిని దులిపివేయవలెనని" వారికి ఇదివరకే తెలియజెప్పబడినది (10:14). వారు ఏదైన ఒక పట్టణములోశత్రుభావముతో కూడిన వైఖరులు ప్రదర్శించు వ్యక్తులను మరియు చర్యలను ఎదుర్కొన్నట్లయితే, అట్టి సంకటావస్థ వలన కలుగు అపాయమును తగ్గించు ప్రయత్నములో వారు అచ్చోటనే ఉండకూడదు దానికి బదులుగా, వారు త్వరగా అచ్చట నుండి తప్పుకొని మరొక పట్టణమునకు చడీచప్పుడు లేకుండా వెళ్లవలెనని ఆయన వారికి చెప్పుచుండవచ్చును. సంఘము సంస్థాపింపబడిన తరువాత, పౌలు ఈ అభ్యాసమును తన మిషనెరీ ప్రయాణములో అమలు చేసాడు (అపొస్తలుల కార్యములు 14:1–7; 17:1–10).

యేసు తన ఉపదేశమును కొనసాగించుచు, **మనుష్యకుమారుడు వచ్చువరకు మీరు ఇశ్రాయేలు పట్టణములలో సంచారము చేసియుండరని, నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని** పలికాడు. "మనుష్యకుమారుడు వచ్చువరకు" అను పదజాలము మనలను దాని భావము గూర్చి బహు గొప్పగా సవాలు చేయుచున్నది. పరిగణించుటకు ఐదు బాధ్యతలు అర్హమైనవై యున్నవి:

(1) అపొస్తలులు సందర్శించిన తరువాత కొంత కాలమునకే యేసు ఈ పట్టణములకు వచ్చుటను ఈ పదజాలము సూచింపవచ్చును (11:1; లూకా 10:1 చూడు).

(2) మరొక దృక్పథము, "మనుష్యకుమారుడు" వచ్చుట గూర్చి పేర్కొనుటలో లేఖనములోని తొలి వాక్యభాగమై యున్న దానియేలు 7:13, 14తో మొదలగుచున్నది. ఈ దృశ్యము క్రీస్తు యొక్క పట్టాభిషేకమును ప్రవచనాత్మకముగా చిత్రీకరించుచున్నది. కాబట్టి, యేసు చేసిన ఈ ఘోషణను అనువదించుటకు దానియేలు 7:13,

14 వినియోగింపబడియున్నట్లయితే, ఆయన పెంతెకొస్తు దినాన తన రాజ్యములోనికి వచ్చుటకు సూచించుచుండి యుండవచ్చును (16:28; అపొస్తులుల కార్యములు 2:36). ఇదే సరైన అనువాదమై యున్నట్లయితే, అప్పుడు మన ప్రభువైన యేసు క్రీస్తు రెండుమూడు సంవత్సరముల ఎడములో నుండిన ఒక కాలమును సూచించుచుండెను. అనగా, "మీరు ఇప్పుడు మరియు మన పరిచర్యలో అటుతరువాత ప్రతి పట్టణములోను ప్రవేశించునప్పటికి మనుష్యకుమారుడు తన రాజ్యముతో వచ్చునని యేసు సెలవిచ్చుచుండెనని మరొక మాటలో చెప్పుకొనవచ్చును."

(3) యెరూషలేము రోమా సైన్యము చేత క్రీ.శ. 70లో నాశనము చేయబడినప్పుడు ఇశ్రాయేలుకు విరోధముగా తీర్పు తీర్చుటకు రానైయుండిన తన రాకడను యేసు పరోక్షంగా మాటవరుసకు ప్రస్తావించియుండవచ్చును. ఏదిఏమైనా, ఇదే భావము ఆయన మనస్సులో ఉండియున్నట్లయితే, నలభై సంవత్సముల తరువాత సంభవింపనై యుండిన ఒక సంఘటనను ఆయన సూచించుచుండెను. ఈ దృష్టికోణము యేసు భావించుచుండిన కార్యనిర్వహణ క్రమమునుతెలుపు కాలపట్టికను సాగదీయుచున్నట్లు అగుపించుచున్నది.

(4) నాలుగవ దృక్పథము, ఇది కూడ దానియేలు 7:13, 14పై ఆధారపడియున్నదే, ఈ పదజాలమును యేసు క్రీస్తు యొక్క రెండవ రాకడకు వర్తింపజేయుటయై యున్నది. మరొక పర్యాయము, ఈ దృష్టికోణము యేసు ధ్వనించుచుండిన కార్యనిర్వహణ క్రమమును తెలుపు కాలపట్టికకు చాలా దూరములో ఉన్నట్లు అగుపించుచున్నది.

(5) యేసు ఈ భౌతిక పుడమిపై ఏలుటకు తిరిగి రానైయున్నాడని సూచించుచుండెనను భావము ఈ పదజాలమును గూర్చిన తప్పుడు దృక్పథమని స్పష్టముగా తెలియుచున్నది. ఈ దృక్పథము ప్రకారము, అపొస్తులుల సకల పట్టణములను చేరుకొనక మునుపు, ఈ పట్టణములను పాలించుటకు మనుష్యకుమారుడు తిరిగి వచ్చును. మొదటిదిగా, యేసు ఈ పుడమిపై తన పరిపాలనను కొనసాగించుటకు తిరిగి వచ్చునని క్రొత్త నిబంధన ఎచ్చోటనైనను చిత్రీకరించుట లేదు. రెండవదిగా, ఆయన మరల వచ్చినప్పుడు, రక్షింపబడినవారిని ఆయనతో కూడ పరలోకములో నుండుటకు ఆయన వారిని అచ్చుటికి కొనిపోవును (యోహాను 18:36; 1 థెస్సలొనీకయులకు 4:16-18 చూడు).

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

## పరిమితమై యుండిన అధికారపూర్వక నియామకము
## (అధ్యాయము 10)

ఈ అధ్యాయమంతటిపై ఈ క్రింది విభజనలతో ఒక పాఠమును అభివృద్ధి చేసికొనవచ్చును: (1) యేసు అపొస్తులులను పిలుచుట (10:1-4); (2) యేసు అపొస్తులులను అధికారపూర్వకంగా నియమించుకొనుట (10:5-15); (3) యేసు అపొస్తులులను హెచ్చరించుట (10:16-23); మరియు (4) యేసు అపొస్తులులకు ఉపదేశించుట (10:24-42).

డేవిడ్ స్టూవర్ట్

## యేసు పరిచర్యల పొడిగింపులు (10:1-8)

అపొస్తలులు యేసు చేత విశిష్టముగా పిలువబడిరి గనుక వారు పరిశుద్ధాత్మ చేత ప్రేరేపింపబడిరి. ఈనాటి క్రైస్తవులు అవే లక్షణములను పంచుకొనుటలేదు. ఏదిఏమైనా, మనము సువార్త చేత పిలువబడి యున్నాము, గనుక మనము పరిశుద్ధాత్మ చేత ప్రేరేపింపబడిన వాక్యమును కలిగియున్నాము. అంతమాత్రమేగాక, యేసు అపొస్తలులకిచ్చిన మహా ఆదేశము నేడు మనకు కూడ వర్తించుచున్నది (28:18-20). అపొస్తలుల వలె, మనము యేసు పరిచర్య యొక్క పొడగింపై యున్నాము. "మనము ఆయన కాలు చేతులమై యున్నామని" చెప్పబడుచున్నది. యేసు క్రీస్తు పరిచర్య పనులు ఈ లోకములో నెరవేర్చబడవలసి యున్నట్లయితే, దానిని చేయవలసినవారు ఆయన శిష్యులే.

డేవిడ్ స్టూవర్ట్

## యేసు యొక్క అపొస్తలులు (10:2-4)

ఆయనకు రాయబారులై యుండుటకు యేసు మొదట్లో పన్నెండుగురిని ఏర్పరచుకొన్నాడు (మార్కు 3:13-15; లూకా 6:12, 13). ఆయన పరిచర్య చేసిన కాలమందంతటను - అనగా ఆయన బాప్తిస్మము పొందినది మొదలుకొని ఆరోహణమగువరకు - వీరు ఆయనతో కూడ ఉండిరి గనుక ఆయన పునరుత్థానమునకు సాక్షులై యుండిరి (అపొస్తలుల కార్యములు 1:21, 22; 2:32). యేసును విద్రోహపూర్వకంగా అప్పగించి, చివరకు తన ప్రాణమును తానే తీసికొనిన యూదా స్థానంలో, మత్తీయ ఏర్పరచుకొనబడెను (అపొస్తలుల 1:15-26). అటుతరువాత యేసు తన అపొస్తలుడుగా ఉండుటకు పౌలును ఏర్పరచుకొనెను (అపొస్తలుల కార్యములు 9:1-22; 1 కొరింథీయులకు 15:1-11; 2 కొరింథీయులకు 11:5). పదునలుగురు మాత్రమే యేసు క్రీస్తు యొక్క ప్రత్యేక అపొస్తలులై యుండిరి.

ఏదిఏమైనా, క్రొత్త నిబంధనలోని ఇతరులు వ్యక్తిగతముగా భిన్నమైన అవగాహన చొప్పున వర్ణించుటకు "అపొస్తలుడు" అను పదము ప్రయోగింపబడినది. ఒక బృహత్కార్యముపై పంపబడినవానికి ముఖ్య మాదిరియై యుండి, ఆయనే "ఆ [the] అపొస్తలుడు" అని యేసు తననుతాను పిలుచుకొన్నాడు (హెబ్రీయులకు 3:1). యాకోబు, యేసు సహోదరుడు, యేసు పునరుత్థానమునకు సాక్షియైయుండెను (1 కొరింథీయులకు 15:7) గనుక యెరూషలేములోని సంఘములో చెప్పుకోదగిన నాయకత్వము వహించాడు (అపొస్తలుల కార్యములు 15:13-21; 21:17, 18; గలతీయులకు 2:7-9). ఈయన "అపొస్తలులలో" ఉండెనని ప్రస్తావింపబడినది (గలతీయులకు 1:19). మరొక ఉదాహరణము, బర్నబా; ఈయన మరియు పౌలు "అపొస్తలులు" అని సంబోధింపబడుచున్నారు (అపొస్తలుల కార్యముల 14:4, 14). వీరు బృహత్కార్యము నిమిత్తమై పరిశుద్ధాత్మ చేత ఏర్పరచుకొనబడినవారై, అంతియొకయలో బోధించుటకు సంఘము చేత పంపబడిరి (అపొస్తలుల కార్యములు 13:1-3). ఇతరులు కూడ "అపొస్తలు" లేక "వార్తహరులు" లేక "దూతలు" అని ప్రస్తావింపబడిరి ఏలయనగా వారు స్థానిక సంఘము చేత ఒక నిర్దిష్టమైన కార్యభారము నిమిత్తమై నియోగింపబడిరి (2 కొరింథీయులకు 8:23; ఫిలిప్పీయులకు 2:25; 1 థెస్సలొనీకయులకు 1:1; 2:6).

## పేతురు (10:2-4)

మన ప్రభువైన యేసు క్రీస్తు యొక్క అపొస్తలుల జాబితాలో పేతురు ఎల్లప్పుడు మొట్టమొదట్లో పేర్కొనబడుచున్నది గనుక, అతడు ముఖ్య అపొస్తలుడై యుండెననియు, "సంఘములో పెద్ద" యై కూడ ఉండెననియు కొందరు సూచించుచున్నారు. ఈ అబద్ధ అవగాహన యేసు మత్తయి 16:18, 19లో పేతురు గూర్చి చేసిన ఒక వాంగ్మూలమును గూర్చిన ఒక అపార్థముపై కూడ ఆధారపడి యున్నది. రోమన్ కథోలిక్ సంఘము పేతురు మొట్టమొదటి పోప్ అయియుండెనని కూడ సాధికారంతో చెప్పుచుందురు. అయితే పేతురే తన స్వంత విషయంలో ఇటువంటి అధికారమును లేక అధికార హోదాను ఎన్నడును సాధికారంతో చెప్పుకొనలేదు. అతడు అన్యజనులతో కూడ భుజించుట ద్వారా ప్రదర్శించిన వేషధారణనుబట్టి పౌలు పేతురును గద్దించాడు (గలతీయులకు 2:11-14), అట్లయినను పౌలు కలిగియుండిన లోతైన తెలివితేటల విషయంలో పేతురు అతనిని అటుతరువాత ప్రశంసించాడు (2 పేతురు 3:15, 16). ఇంతేగాక, పేతురు తనను గూర్చి తాను వినయముతో "తోటి పెద్దను" అని వర్ణించుకొన్నాడు (1 పేతురు 5:1). క్రీస్తు యొక్క ఆది సంఘమునకు "పోప్" అనువాడు ఎన్నడును లేకుండెను, క్రీస్తు సంఘమునకు క్రీస్తు మాత్రమే శిరస్సై యున్నాడు (ఎఫెసీయులకు 1:22, 23; 5:23; కొలొస్సయులకు 1:18).

## "పైనుండి వచ్చు శక్తి" (10:8)

వారు ఆయనకు సాక్షులైయుండునట్లు వారు పరిశుద్ధాత్మ వలన "శక్తి" నొందెదరని యేసు అపొస్తలులకు వాగ్దానమిచ్చాడు (అపొస్తలుల కార్యములు 1:8; లూకా 24:49 చూడు). పరిశుద్ధాత్మ యొక్క నానావిధ వరములను ఇతరులకు యివ్వగల సామర్థ్యము వారు పొందిన శక్తులలో లేక "వరములలో" ఒకటై యుండినది (1 కొరింథీయులకు 12:4-11). అపొస్తలుల కార్యముల పుస్తకంలోని తొలి అధ్యాయాల్లో, దీనిని చేయగలిగినవారు అపొస్తలులు మాత్రమే అని స్పష్టముగా నున్నది (అపొస్తలుల కార్యములు 8:14, 15).

సతస్సిద్ధమైన పరిశుద్ధాత్మ కుమ్మరింపు రెండు పర్యాయములు మాత్రమే సంభవించినది (అపొస్తలుల కార్యములు 2; 10) గనుక, ఇతరులు ఆశ్చర్యజనక శక్తులను పరిశుద్ధాత్మ వలన పొందుటకు, ఈ వరములు అపొస్తలుల చేత ప్రధానము చేయబడుట ఒక మార్గమై యుండినది. అపొస్తలులు ప్రార్థన చేసి, అటుతరువాత వారి చేతులుంచుటతో ఇది సంభవించినది.

ఆయన యేసు క్రీస్తును తన స్వరక్షకునిగాను, ప్రభువుగాను అంగీకరించిన తరువాత ఏదో ఒక సమయంలో (అపొస్తలుల కార్యములు 9), పౌలు ఆశ్చర్యజనక వరములను మరియు అట్టి వరములను ఇతరులకు యిచ్చుటకు సామర్థ్యమును కూడ పొందాడు. ఒక అపొస్తలుడుగా, పౌలు నూతన విశ్వాసులపై తన హస్తములను ఉంచగలిగాడు, మరియు వారికి పరిశుద్ధాత్మ వరములతో కూడిన శక్తిని ప్రసాదించగలిగాడు (అపొస్తలుల కార్యములు 19:6; రోమీయులకు 1:11-12; 2 తిమోతి 1:6). ఒక క్రైస్తవుడు ఒకసారి వరమును పొందాడంటే, అతడు అదనపు వరముల కొరకు సహితము ప్రార్థన ద్వారా అడుగుకొని పొందగలిగి యుండెనని అగుపించుచున్నది. వారు "కృపావరములలో శ్రేష్ఠమైనవాటిని," "విశేషముగా ప్రవచన వరమును," "ఆసక్తితో ఆపేక్షించవలెనని" పౌలు

కొరింథీ సంఘ సభ్యులకు వ్రాసాడు (1 కొరింథీయులకు 12:31; 14:1). భాషలలో మాటలాడుచుండినవారు "అర్థము చెప్పు శక్తికలుగుటకై ప్రార్థించవలెనని" ఆయన వారిని ప్రోత్సాహించాడు (1 కొరింథీయులకు 14:13).

చివరి అపొస్తలుడు మరణించినప్పుడు ఇతరులకు వరములను ప్రదానము చేయగల సామర్థ్యము కూడ అతనితోనే అంతమయ్యింది. అపొస్తలుడు తన చేతులుంచిన చివరి వ్యక్తి మరణించుటతో, పరిశుద్ధాత్మ అనుగ్రహించు ఆశ్చర్యజనక వరములు భూమిపై నిలిచిపోయినవి.

## "తక్కువ సామానుతో పయనించుడి" (10:9, 10)

మత్తయి 10:9, 10 వచనములలో గల నిర్బంధములు పరిమితమైన సాధికార కార్యభారము ఇవ్వబడిన అపొస్తలులకు మాత్రమే అన్వయింపబడి యుండినను, మహా ఆదేశమును నెరవేర్చుటకు మనము చేయు ప్రయత్నము సందర్భములో అవి మనకు కనీసము రెండు పాఠములనైనా సమకూర్చుచున్నవి. మొదటిగా, వారికియ్యబడిన కార్యభారమును నిర్వర్తించుటకు దేవుడు వానికి సమస్తమును సమకూర్చునని అపొస్తలులు విశ్వసించవలసి యుండిన విధంగానే, అదే దేవుడు ఈ రోజుల్లో మనల గూర్చి తగు శ్రద్ధ వహించునని మనము కూడ విశ్వసించవలసి యున్నది. రెండవదిగా, మనకియ్యబడిన ప్రపంచ సౌవార్తీకరణ కార్యభారమును మనము నెరవేర్చకుండునట్లు ఐహిక ఆస్తులు ఒక ఆటంకమై యుండగలవు.

> ఏ సంఘటన సందర్భములోనైనను, 9–10 వచనములలో గల ప్రధాన సందేశము "తక్కువ సామానుతో పయనించుడి" అనునదై యున్నది. ఈ విషయాన్ని ఆధునిక కీలకాంశముగా మార్చినప్పుడు, క్రైస్తవ మిషనెరీలు, భౌతికవాదమునకు సంబంధించినవి మితిమీరి లేకుండా, మామూలు జీవితము జీవించవలెనని ఇది సూచించును. బహుదూరముగా నున్న ప్రదేశములలో సువార్తను ప్రకటించు నిమిత్తము సొంత ఇంటిని మరియు దేశమును విడిచిపెట్టువారి విషయంలోను, వారి విశ్వాసమును స్వస్థలంలోనున్న పొరుగువారితో పంచుకొనగోరువారి విషయంలోను ఇది వాస్తవమై యున్నది. అధికముగా నున్న ఆస్తిపాస్తులు సువార్త ప్రచురణను ఆటంకపరుచునట్లు మనము అనుమతించకూడదు.[43]
>
> డేవిడ్ స్టూవర్ట్

## సువార్తికులను పోషించుట (10:10)

సువార్త ప్రకటన పరిచర్యను చేయుచుండువారికి వారు చేయుచున్న పనులనుబట్టి పరిహారము చెల్లించుటను కొందరు ఆక్షేపించుదురు. ఏదిఏమైనా, "పనివాడు తన ఆహారమునకు పాత్రుడని" యేసు స్పష్టంగా తెలియజెసాడు (10:10). సువార్తను ప్రకటించు పనివారికి పరిహారము చెల్లించుటను పౌలు సమర్థించుట మాత్రమేగాక, ఆయన దాని గూర్చి ఆజ్ఞాపించాడు: "మీ కొరకు ఆత్మ సంబంధమైనవి మేము విత్తియుండగా, మీ వలన శరీరసంబంధమైన ఫలములు కోసికొనుట గొప్ప కార్యమా?" (1 కొరింథీయులకు 9:11); "అలాగున సువార్త ప్రచురించువారు సువార్త వలన జీవింపవలెనని ప్రభువు

నియమించియున్నాడు" (1 కొరింథీయులకు 9:14). బోధకులు కేవలము డబ్బు సంపాదన కొరకే బోధించకూడదు, కానీ వారు చాలినంతగా పోషింపబడవలెను.

డేవిడ్ స్టూవర్ట్

### ప్రతిఫలము మరియు శిక్షా పరిణామములు (10:15)

ఆయన తన అపొస్తలులను తృణీకరించినవారి గూర్చి చర్చించినప్పుడు, "విమర్శదినమందు ఆ పట్టణపు గతి కంటె సొదొమ గొమొఱ్ఱా ప్రదేశముల గతి ఓర్వతగినదై యుండునని" యేసు సెలవిచ్చాడు (10:15). "ఎక్కువ ఓర్వతగినదై" అను మాటలు శిక్ష ఉండదు ధ్వనింపునిచ్చుట లేదు. యేసు ఈ అభిప్రాయమును గూర్చిన సూచనయైనను ఇచ్చుటలేదు. గనుక అత్యంత స్పష్టమైన అర్థమేమనగా, సొదొమ మరియు గొమొఱ్ఱా పట్టణములకు, యేసు మరియు ఆయన శిష్యులు సందర్శించిన ఇతర పట్టణములకు వలెనే, అదే ఎరుక లేక అవకాశము లేకుండినందు వలన, ఆ పట్టణములలో నుండిన ప్రజలు దేవుని సందేశమును తృణీకరించినవారు శ్రమనొందినంత గొప్పగా శ్రమనొందరు. అనగా, అవకాశములు గొప్పగా కలిగియుండువారు బాధ్యతను కూడ గొప్పగా కలిగియుందురని మరొక మాటలో చెప్పుకొనవచ్చును (హెబ్రీయులకు 10:26-30 చూడు). విభిన్నముగా నుండు శిక్షా పరిమాణములు గూర్చిన అభిప్రాయము ఇతర వాక్యభాగములలో కూడ కలదు (11:20-24; లూకా 12:41-48; 20:47).

ప్రతిఫలముల పరిణామములు సహితము విభిన్నమైనవై యుండునని కూడ క్రొత్త నిబంధన సూచించుచున్నది (5:19; 6:19-21; 18:4; లూకా 19:17-19; 1 కొరింథీయులకు 3:12-15; 2 కొరింథీయులకు 9:6; యాకోబు 3:1). రక్షణ క్రీస్తునందు ప్రత్యక్షపరచబడిన దేవుని కృప చేతనే కలుగుతోంది (ఎఫెసీయులకు 2:8-10); ఎవడును పరలోకములో సొంతగా ప్రవేశింపలేడు (రోమీయులకు 6:23). ఏదిఏమైనా, క్రైస్తవులకు దేవుడే తీర్పు తీర్చుననియు, ప్రతి ఒక్కనికి వాని వాని వ్యక్తిగత ప్రతిఫలము ఇవ్వబడునను వాస్తవమును ఇది రద్దుచేయదు. "ఎందుకనగా తాను జరిగించిన వాటి ఫలమును, ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలెనని" పౌలు రచించాడు (2 కొరింథీయులకు 5:10; రోమీయులకు 2:5-11; 14:10-12; 1 కొరింథీయులకు 4:5; ప్రకటన 20:11-15 చూడు). క్రైస్తవ విశ్వాసి చేయు క్రియలకు దేవుడు వేయు మూల్యాంకనము వాడు పొందు ప్రతిఫలమును నిర్ధారిస్తోంది.

### వ్యతిరేకతను ఎదుర్కొనుట (10:16-23)

ఆయన శిష్యులు మూడు దిశల నుండి హింసలు ఎదుర్కొందురని యేసు ముందుగానే తెలియజెప్పాడు: మతపరమైన వ్యవస్థలు, ప్రభుత్వము, మరియు వారి సొంత కుటుంబములు, తమతమ పరిమాణముల చొప్పున, ప్రపంచమందంతటను గల క్రైస్తవులు కూడ పేర్కొనబడిన ఇదే శక్తుల నుండి వ్యతిరేకతను ఎదుర్కొన వచ్చును.

*మతపరమైన వ్యవస్థ.* రాజ్యములో లేక రాష్ట్రములో నిర్దిష్టమైన మతము వ్యవస్థాపింపబడి యున్న స్థలములలో నివసించుచుండు కొందరు ఇటువంటి శత్రుభావమును

ఎదుర్కొనవచ్చును. "క్రైస్తవులము" అని తమ్మునుతాము పిలుచుకొనువారందరు సహితము "క్రైస్తవులు" అని పిలువబడు ఇతరులను ద్వేషింపవచ్చును. "క్రైస్తవులు మాత్రమే" అన్నట్లు మెలగుటకు లేక జీవించుటకు ప్రయాసపడువారు తరచుగా అందరి కంటె అత్యధికంగా అధములైనవారి వలె పరిగణింపబడుదురు.

*ప్రభుత్వము.* ప్రభుత్వము మత స్వేచ్ఛను అనుమతించని ప్రదేశములలో నివసించుచుండువారు ఏకాంతముగా లేదా రహస్యముగా, చట్టవిరుద్ధముగా కూడుకొనునట్లు బలవంతము చేయబడుదురు వారు పట్టబడి నిర్బంధింపబడుటకు, కొట్టబడుటకు, మరియు చెరసాలలో వేయబడుటకు ప్రమాదకరమైన పరిస్థితులు కలవు. ఇతర సందర్భములలో, అవినీతి మరియు అన్యాయము గూర్చి మాటలాడు క్రైస్తవులు ప్రభుత్వము చేత వ్యతిరేకింపబడుదురు.

*కుటుంబము.* వారు క్రైస్తవులై యుంటున్నందుకు కొందరు వారి సొంత కుటుంబ సభ్యుల చేతనే హేళన చేయబడుచుందురు. నైతిక విలువలలో గల తారతమ్యములు మరియు ప్రాధాన్యత ఇవ్వబడుచుండు పరిస్థితులు తరచుగా సంఘర్షణలకు దారి తీయుచుండును. తీవ్రమైన కొన్ని సందర్భములలో, విశ్వాసులు వారి సొంత బంధువుల చేతనే 'నీతో మాకెటువంటి సంబంధము లేదని' చెప్పుచు వెలివేయబడుచుందురు.

డేవిడ్ స్టూవర్ట్

**సందేశమునకు సిద్ధపాటు (10:20)**

అపొస్తలులకు దైవికమైన ప్రేరేపణ పరిశుద్ధాత్మ చేత అనుగ్రహింపబడునని యేసు వాగ్దానం చేసాడు. మౌన్స్ ఇలా వ్రాయుచున్నాడు, "దురదృష్టవశాత్తు, ఆదివారం నాటి ఆరాధనలో అందించబడవలసి యుండు దైవసందేశమునకు సిద్ధపడకుండునట్లు అనేక మంది బోధకులకు ఈ వచనము ఒక నెపమును సమకూర్చినది."[44] ఈనాడు మనకు ప్రేరేపణా వరము లేదు గనుక దానికి బదులుగా, మనము పరిశుద్ధాత్మ చేత ప్రేరేపింపబడినదైన దేవుని వాక్యమును అధ్యయనము చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. "అపొస్తలులు దానిని దైవావేశం ద్వారా పొందారు మనము చెమటోడ్చుట ద్వారా దానిని పొందవలసి యున్నదని, సియర్సి ఆర్కన్సాస్‌లోని హార్డింగ్ విశ్వవిద్యాలయములో విద్యనభ్యసించుచుండిన తన విద్యార్థులకు జిమ్మీ ఆల్లెన్ తెలియజెప్పుచుండెడివాడు."

---

సూచనలు

[1]Donald A. Hagner, *Matthew 1-13,* Word Biblical Commentary, vol. 33A (Dallas: Word Books, 1993), 262. [2]Douglas R. A. Hare, *Matthew,* Interpretation (Louisville: John Knox Press, 1993), 113. [3]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 3d ed., rev. and ed. Frederick W. Danker (Chicago: University of Chicago Press, 2000), 881. [4]Jack P. Lewis, *The Gospel According to Matthew*, Part 1, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 145 చూడుము; మరియు R. T. France, *The Gospel According to Matthew,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 176 చూడుము. [5]Michael J. Wilkins, "Matthew," in *Zondervan Illustrated Bible Backgrounds Commentary*, vol. 1, *Matthew, Mark, Luke*, ed.

Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 67. [6]ఆయన ఇదివరకటి అధ్యాయములలో ప్రదర్శించినటువంటి "అధికారము" లేక "శక్తి"ని యేసు తన శిష్యులకిచ్చాడు (7:28, 29; 8:9పై గల వ్యాఖ్యానములను చూడు). [7]కొన్ని ప్రాచీన చేతివ్రాత ప్రతులలోని మార్కు 3:14లో అపొస్తలోని అను పదము. [8]"అపొస్తలుడు" అను పదము తరుచుగా పౌలును వర్ణించుటకు ప్రయోగింపబడినది, పౌలు ప్రభువు చేత ప్రత్యేకమైన రీతిలో ఏర్పరచుకొనబడి నియామకము చేయబడినాడు (1 కొరింథీయులకు 15:8–10). అంతమాత్రమేగాక, ఒక సంఘము చేత పంపబడినవానిని సూచించుటకు కూడ ఈ పదము దాని విశాలమైన భావముతో ప్రయోగింపబడినది (అపొస్తలుల కార్యములు 14:4, 14; 2 కొరింథీయులకు 8:23; ఫిలిప్పీయులకు 2:25; 1 థెస్సలొనీకయులకు 1:1; 2:6). [9]See W. F. Albright and C. S. Mann, *Matthew*, The Anchor Bible (Garden City, N.Y.: Doubleday & Co., 1971), 117. [10]Lewis, 147.

[11]"కెరీయోతు" అను పేరుగల మరొక పట్టణము మోయాబులో ఉండినది (యిర్మీయా 48:23; ఆమోసు 2:2). [12]Hagner, 266; George Wesley Buchanan, "Judas Iscariot," in *The International Standard Bible Encyclopedia,* rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 2:1151–52 చూడు. [13]Robert H. Mounce, *Matthew,* New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 92. [14]William Barclay, *The Gospel of Matthew,* vol. 1, 2d ed., The Daily Study Bible (Philadelphia: Westminster Press, 1958), 1:373. [15]Ibid. [16]మత్తయి వ్రాసిన సువార్తలో సమరయులు ఒక్కసారి మాత్రమే పేర్కొనబడి యున్నారు (10:5). ఈ మిశ్రమ ప్రజలు దిగుమతి చేయబడినట్లుగా క్రీ.పూ. 722లో అష్షూరు దేశ చెర తదుపరి వచ్చిన విదేశీయులు ఇశ్రాయేలీయులను వివాహమాడుట వలన కలిగిరి (2 రాజులు17:24; నెహెమ్యా 13:23, 24 చూడు). వారికిని యూదులకును మధ్య ఏర్పడిన సంఘర్షణలు దేశబహిష్కృతులైన తరువాతి కాలమునకు సంబంధించినవై యున్నవి (ఎజ్రా 4:1–24). [17]J. W. McGarvey, *The New Testament Commentary*, vol. 1, *Matthew and Mark* (N.p., 1875; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.), 89. [18]Mounce, 92. [19]Bauer, 811 చూడు. [20]వారి సొంత జాతికి చెందినవారికి అతిథ్యమిచ్చుటలో అత్యధికంగా పేరుగాంచినవారై యుండినవారు, ఎస్సెనీయులతో సమతుల్యము చేయబడవచ్చును. జోసీఫస్ ఇలా నివేదించుచున్నాడు, "ఈ హేతువునుబట్టియే వారు దూర ప్రాంతములకు ప్రయాణం చేయునప్పుడు, దొంగల భయమునుబట్టి, వారి ఆయుధములు తప్ప, వారితోకూడ మరేమియు తీసికొనివెళ్లరు" (Josephus *Wars* 2.8.4).

[21]John Lightfoot, *A Commentary on the New Testament from the Talmud and Hebraica: Matthew-1 Corinthians*, vol. 2, *Matthew-Mark* (Oxford: Oxford University Press, 1859; reprint, Grand Rapids, Mich.: Baker, 1979), 183–85 చూడు. [22]David Hill, *The Gospel of Matthew,* The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1972), 186. [23]France, 181. [24]పాత నిబంధన మరియు క్రొత్త నిబంధనలో గల అతిథ్యమునకు సంబంధించిన ఉదాహరణములు కొరకు William Hendriksen, *New Testament Commentary: Exposition of the Gospel According to Matthew* (Grand Rapids, Mich.: Baker Book House, 1973), 459 చూడు. [25]Hill, 187. [26]Mounce, 93. [27]Talmud *Nedarim* 53b; *Sanhedrin* 12a చూడు. [28]H. Leo Boles, *A Commentary on the Gospel According to Matthew* (Nashville: Gospel Advocate Co., 1936), 226. [29]en. 13:13; 19:24, 25; ద్వితీయోపదేశకాండము 32:32; యెషయా 1:10; యెహెజ్కేలు 16:46, 48, 49; మత్తయి 11:22, 24; లూకా 10:12; 17:29; రోమీయులకు 9:29; 2 పేతురు 2:6; యూదా 7. [30]James Burton Coffman, *A Commentary on Matthew* (Austin, Tex.: Firm Foundation Publishing House, 1977), 136.

[31]Wilkins, 69. [32]*Rabbah Song of Songs* 2.14.1. [33]Gerhard F. Hasel, "Dove," in *The International Standard Bible Encyclopedia,* rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1979), 1:988. [34]Mishnah *Sanhedrin* 1.2. [35]Wilkins, 69. [36]ఈ సూత్రము పనిచేయుచున్నదనుటకు యేసు తీర్పులు ఒక నిదర్శనమై యున్నవి. ఆయన మొదట యెరూషలేములో సన్హెడ్రిన్ మహా సభ చేత తీర్పు తీర్చబడెను, కానీ యేసు హేరోదు చేత కూడ పరీక్షింపబడి చివరకు చట్టరీత్య అధికారియై యుండిన పొంతి పిలాతు చేత మరణ దండన విధించబడెను (లూకా 22:54–23:25). [37]Tacitus *Annals* 15.44. [38]Coffman, 137. [39]Talmud *Sanhedrin* 97a. [40]Wilkins, 69.

[41]Lewis, 152. [42]Albert Barnes, *Notes on the New Testament: Matthew and Mark,* ed. Robert Frew (Philadelphia: N.p., 1832; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1974), 113. [43]Hare, 112. [44]Mounce, 94.